జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం









రంగారెడ్డి | గురువారం 26 మార్చి 2026 | సంపుటి : 16 | సంచిక : 242 | వెల: రూ.5 | పేజీలు: 08 | RNI NO.APTEL/2010/36516

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పూర్ణిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from RANGAREDDY, WARANGAL, KAMMAM, NALAGONDA http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com


# ఎవరో ఎందుకు? నువ్వే పోటీ చెయ్!



- సిద్దిపేటలో రేవంత్‌రెడ్డి నాపై పోటీచేయాలని ఆహ్వానిస్తున్నా
- తలకిందులుగా తపస్సు చేసినా రేవంత్ మళ్లీ సీఎం కాలేడు
- ఎన్నికలు ఎప్పుడు వచ్చినా గెలిచేది బీఆర్ఎస్సే, సీఎం కేసీఆరే
- నియోజకవర్గాల పునర్విభజన,మహిళా రిజర్వేషన్లతో మాకు లాభమే
- బీఆర్ఎస్‌లో జీవన్‌రెడ్డి చేరికపై వేచిచూడండి..

హైదరాబాద్

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సిద్దిపేటలో పోటీ చేసి గెలిచే వారికి మంత్రి పదవి ఇస్తానంటూ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై శాసన సభలో బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు స్పందించారు. 'ఎవరో ఎందుకు.. నువ్వే పోటీచెయ్.. సిద్దిపేటలో నా మీద పోటీ చేయాల్సిందిగా రేవంత్‌రెడ్డిని ఆహ్వానిస్తున్నా'అని వ్యాఖ్యానించారు. రేవంత్ తలకిందులుగా తపస్సు చేసినా తిరిగి సీఎం కాలేడన్నారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తుందని, కేసీఆర్ సీఎం అవుతారని జోస్యం చెప్పారు. రేవంత్ పనితనం చూసి - మిగతా3లో



# పేదోడి ఇంటి కల నిజం చేసింది వైఎస్సార్

- ఆయన హయాంలోనే 21 లక్షల ఇళ్లు : మంత్రి పొంగులేటి
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంప్రతిష్టాత్మకం... ఏప్రిల్ మొదటి వారంలో 1.12 లక్షల ఇళ్లిస్తాం
- రాజకీయాలకు అతీతంగా లబ్ధిదారుల ఎంపిక... స్థానికసర్పంచ్‌లకూ పూర్తి అధికారం
- ఇళ్లలో ఉండకుంటే ఇతరులకు కేటాయింపు... ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి టోల్ ఫ్రీ నంబర్

3లో



## పాకిస్థాన్‌లాగా భారత్ బ్రోకర్ కంట్రీ కాదు

- జైశంకర్ ఘాటు వ్యాఖ్యలు
- అమెరికా-ఇరాన్ కాల్పుల విరమణ చర్చలకు మధ్యవర్తిత్వం వహించేందుకు సిద్ధమన్న పాకిస్థాన్
- పాక్ దళారీ దేశమని జైశంకర్ విమర్శ

2



## మోడిఫైడ్ ఉడాన్

- దేశంలో 100 కొత్త ఎయిర్‌పోర్టులు నిర్మాణం
- కేంద్ర కేబినెట్ భేటీలో కీలక నిర్ణయాలు
- టైర్ -2, టైర్ - 3 నగరాల కోసం మోడిఫైడ్ ఉడాన్
- 100 కొత్త ఎయిర్‌పోర్టులు, 200 ఆధునిక హెలిప్యాడ్‌ల నిర్మాణం
- టూరిజం, వాణిజ్యాన్ని పెంచడమే లక్ష్యం

# కూటమి ప్రభుత్వానికి ఓటమి తప్పదు

- అసెంబ్లీ, పార్లమెంటు సీట్ల పెంపు గుడ్‌న్యూస్
- రాష్ట్రంలో కావాలనే భూవివాదాన్ని సృష్టిస్తున్నారు









# రాజధాని అమరావతికి చట్టబద్ధత

- కేంద్ర కేబినెట్ తీర్మానానికి రంగం సిద్ధం
- ఈ నెల 28న అసెంబ్లీ ప్రత్యేక సమావేశం

అమరావతి

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించే విషయంలో కేంద్ర కేబినెట్ త్వరలో నిర్ణయం తీసుకోనుంది. ఈ మేరకు తీర్మానానికి కేంద్ర ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా చట్టపరమైన ఇబ్బందులు తలెత్తకుండా కేంద్రం జాగ్రత్తలు తీసుకుంటోంది. అందుకు గాను సీఆర్డీఏ--2014 తీర్మానాన్ని - మిగతా3లో




## ఓటర్ల జాబితాలో పేర్లు తొలగింపుపై మమత ఫైర్

- ఎన్నికల పారదర్శకతపై ప్రశ్నలు!
- బీజేపీ, ఈసీ కుమ్మక్కు అయ్యాయి
- ఓటర్ల జాబితా నుంచి పేర్లు తొలగించడంపై మమతా బెనర్జీ ఫైర్?

# విద్యుత్ కొనుగోలు వ్యయం తగ్గాల్సిందే

- యూనిట్ రూ.4కు రావాలి : సీఎం చంద్రబాబు
- గత ఏడాది సమర్థ నిర్వహణతో రూ.339 కోట్లు ఆదా
- రాబోయే రోజుల్లో విద్యుత్ రంగం గేమ్ ఛేంజర్ కానుంది
- విద్యుత్ రంగంపై సమీక్షలో సీఎం చంద్రబాబు



హైదరాబాద్

విద్యుత్ కొనుగోలు వ్యయాన్ని తగ్గించడంపై సమగ్రంగా దృష్టి సారించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఇప్పటికే ఈ దిశగా చేపడుతున్న చర్యలను మరింత ముమ్మరం చేయాలని స్పష్టం చేశారు. సచివాలయంలో విద్యుత్ రంగంపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో సీఎం చంద్రబాబు ఈ వ్యాఖ్యలు చేశారు. విద్యుత్ కొనుగోలు యూనిట్ వ్యయాన్ని రూ.4కు తగ్గించేలా, అదే సమయంలో ప్రజలపై అదనపు ఛార్జీల భారం మోపకుండానే విద్యుత్ సంస్థలు తమ రుణాలను తిరిగి చెల్లించేలా ఒక కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. సాంకేతికత, ఆవిష్కరణల వినియోగంతో పొదుపు చర్యలు చేపట్టాలి అన్నారు. సమర్థవంతమైన నిర్వహణ కారణంగా 2025-26 ఆర్థిక సంవత్సరంలో - మిగతా3లో

# 'మోడిఫైడ్ ఉడాన్'



ప్రధానమంత్రి నరేంద్రమోదీ సారథ్యంలో బుధవారం సమావేశమైన కేంద్ర కేబినెట్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ప్రాంతీయ అనుసంధాన పథకం – మోడిఫైడ్ ఉడాన్‌ను ప్రారంభించే ప్రతిపాదనకు కేబినెట్ పచ్చజెండా ఊపింది. 2026–2027 ఆర్థిక సంవత్సరం నుంచి 2035–2036 వరకు పదేళ్ల పాటు రూ.28,840 కోట్ల వ్యయంతో ఈ స్కీంను అమలు చేయాలని సర్కారు నిర్ణయించింది. ఈ స్కీంకు కేంద్ర ప్రభుత్వమే నిధులను సమకూర్చనుంది. కేబినెట్ భేటీలో తీసుకున్న నిర్ణయాల వివరాలను కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం, దేశంలో విమాన సర్వీసులు తక్కువగా ఉన్న, పూర్తిగా విమాన సర్వీసులు లేని పలు నగరాల్లో మోడిఫైడ్ ఉడాన్ పథకం ద్వారా విమాన సర్వీసులను అందుబాటులోకి తేనున్నారు. ఇక ఇదే సమయంలో సాధారణ పౌరుల విమాన ప్రయాణ ఛార్జీలను వీలైనంత తక్కువగా ఉంచేందుకు ఈ స్కీం ద్వారా తోడ్పాటును అందించనున్నారు.

ఇమిగ్రేషన్, వీసా, ఫారినర్స్ రిజిస్ట్రేషన్ అండ్ ట్రాకింగ్ స్కీం అమలును మరో ఐదేళ్లు పొడిగించే ప్రతిపాదనకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ స్కీం ద్వారా ఇమిగ్రేషన్, వీసా జారీ, భారత్‌లోని విదేశీయుల రిజిస్ట్రేషన్‌లతో ముడిపడిన ప్రక్రియలను అత్యాధునిక టెక్నాలజీతో పరస్పరం అనుసంధానిస్తారు. ఉడాన్ స్కీంను మళ్లీ 2026 ఏప్రిల్ 1 నుంచి 2031 మార్చి 31 వరకు అమలు చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఇందుకోసం రాబోయే ఐదేళ్లలో రూ.1,800 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేయనుంది.

**ఉడాన్ స్కీం అమలును అందుకోసమే పొడిగించాం**

ఉడాన్' స్కీం అమలు గడువును పొడిగించడం అనేది కేవలం సాంకేతికమైన అప్‌గ్రేడ్ కాదు. వాస్తవానికి అదొక వ్యూహాత్మక మార్పు. భారత పర్యటనకు వచ్చే విదేశీయుల కోసం ప్రపంచ స్థాయి ఇమిగ్రేషన్, వీసా జారీ వ్యవస్థలను అందుబాటులోకి తేవాలనే విజన్ మా ప్రభుత్వానికి ఉంది. ఇటీవలే ఇమిగ్రేషన్ అండ్ ఫారినర్స్ యాక్ట్ – 2025 ఆమోదం పొందినందున దాని నియమాలు, మార్గదర్శకాల ప్రకారం వెంటనే ×ఎఖీ=¬ వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఏర్పడింది. ప్రస్తుత అవసరాలు, వలసల నియంత్రణతో ముడిపడిన భవిష్యత్ సవాళ్లు, దేశంలోని విదేశీయుల నిర్వహణ, అక్రమ వలసల కట్టడి వంటి వాటి కోసం ×ఎఖీ=¬ వ్యవస్థ ఉపయోగపడుతుంది" అని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు.

**టైర్ -2, టైర్ - 3 నగరాల కోసం మోడిఫైడ్ ఉడాన్**

ప్రతిష్ఠాత్మకమైన మోడిఫైడ్ ఉడాన్ స్కీం పేరులోని ఖణూచీ అంటే 'ఉడే దేశ్ కా ఆమ్ నాగరిక్' (దేశపు సామాన్య పౌరుడూ ఎగరాలి) అని అర్థం. ఈ స్కీంనే ఉడాన్ 2.0 అని కూడా పిలుస్తారు. దీని ద్వారా రాబోయే పదేళ్లలో రూ.28,840 కోట్లతో దేశవ్యాప్తంగా ఎంపిక చేసే నగరాల్లో 100 కొత్త ఎయిర్‌పోర్టులను, 200 ఆధునిక హెలిప్యాడ్‌లను నిర్మిస్తారు. ఈ పథకం కోసం టైర్ -2, టైర్ - 3 నగరాలు, కొండ ప్రాంతాలు, మారుమూల నగరాలు, పర్యాటక ప్రదేశాలు, వాణిజ్య ప్రదేశాలకు ఎక్కువ ప్రయారిటీ ఇస్తారు. ఆయా నగరాల నుంచి సామాన్య ప్రజలు వీలైనంత తక్కువ ఛార్జీతో విమాన ప్రయాణం చేసే ఏర్పాట్లు చేయాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది.

**100 కొత్త ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి రూ.12,159 కోట్లు**

"మా ప్రభుత్వం 2047 వికసిత భారత్ లక్ష్యంతో పనిచేస్తోంది. దేశంలో వాణిజ్యం, టూరిజాన్ని మరింత పెంచే లక్ష్యంతోనే మోడిఫైడ్ ఉడాన్ స్కీంను ప్రకటించాం. ప్రాంతీయ విమానయాన సర్వీసులు పెరిగితే విపత్తు స్పందన సేవలు, అత్యవసర వైద్య సేవలు టైర్ -2, టైర్-3 నగరాలు, కొండ ప్రాంతాల ప్రజలకు ఇంకా చేరువ అవుతాయి. దీనివల్ల ప్రాంతీయ విమాన సర్వీసులకు, విమానయాన సంస్థలకు లబ్ధి చేకూరుతుంది. ప్రస్తుతం వినియోగంలో లేని ఎయిర్ స్ట్రిప్‌లను కూడా ఈ స్కీం ద్వారా తిరిగి వినియోగంలోకి తెస్తాం. 100 కొత్త ఎయిర్‌పోర్టుల నిర్మాణ పనుల కోసం రాబోయే 8 ఏళ్లలో రూ.12,159 కోట్లు ఖర్చు చేస్తాం. తద్వారా అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన విమానయాన వ్యవస్థ మన దేశంలోనూ అందుబాటులోకి వస్తుంది. ఎయిర్‌పోర్టుల నిర్మాణంతో పాటు నిర్వహణ, విమాన సర్వీసుల కార్యకలాపాలకూ ఈ స్కీం ద్వారా తోడ్పాటును అందిస్తాం" అని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు.

**విమానయాన సంస్థలకు తొలి మూడేళ్లు ఆర్థికసాయం**

"ప్రాంతీయ విమాన సర్వీసులను నడిపే కంపెనీలకు పెద్దగా లాభాలు రావు. అందుకే వాటికి నిర్వహణ, కార్యకలాపాల విభాగంలో తొలి మూడేళ్ల పాటు ఆర్థికసాయాన్ని అందిస్తాం. ఒక్కో కొత్త ఎయిర్‌పోర్టు పరిధిలో ఒక్కో విమానయాన సంస్థకు ఏటా రూ.3.06 కోట్ల సాయాన్ని అందిస్తాం. ఇక హెలిపోర్టులు, వాటర్ ఏరోడ్రోమ్స్ సేవలను అందించే సంస్థలకు ఏటా రూ.90 లక్షల సాయాన్ని అందిస్తాం. దీంతోపాటు ప్రాంతీయ విమాన సర్వీసులను అందించే విమానయాన సంస్థలకు రాబోయే పదేళ్ల పాటు వయబులిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్) లభిస్తుంది. వచ్చే పదేళ్ల కోసం రూ.10,043 కోట్లను కేటాయించాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. మోడిఫైడ్ ఉడాన్ స్కీంలో భాగంగా దాదాపు 441 ఎయిర్‌పోర్టుల నిర్వహణ, కార్యకలాపాలకు సాయం చేయడానికి రూ.2,577 కోట్లు అవసరమని మేం అంచనా వేశాం. ఇక దేశంలో 200 ఆధునిక హెలిప్యాడ్‌లను నిర్మిస్తాం. ఒక్కో హెలిప్యాడ్ నిర్మాణానికి రూ.15 కోట్లు ఖర్చవుతాయి. వీటి నిర్మాణ పనుల కోసం రాబోయే 8 ఏళ్లలో రూ.3,661 కోట్లను ఖర్చు చేస్తాం" అని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ చెప్పారు. "చిన్న విమానాల కొరతను తీర్చడానికి పవన్ హన్స్ సంస్థ కోసం హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ నుంచి 2 ధ్రువ్ హెలికాప్టర్లను కొంటాం. అలయన్స్ ఎయిర్ కోసం హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ నుంచి 2 డార్నియెర్ విమానాలు కొంటాం. కొండ ప్రాంతాలు, మారుమూల ఏరియాల్లో ఆపరేషన్ల కోసం వీటిని వినియోగిస్తాం" అని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు.

# ఓటర్ల జాబితాలో పేర్లు తొలగింపుపై మమత ఫైర్



భారత ఎన్నికల సంఘం(ఈసీ), బీజేపీపై బంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ విమర్శలు గుప్పించారు. ఓటర్ల జాబితా నుంచి నిజమైన ఓటర్ల పేర్లను తొలగించడంపై మమతా బెనర్జీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ఎన్నికల నిష్పాక్షికత, పారదర్శకతపై అనుమానాలు కలిగిస్తోందని అన్నారు. 'నిజమైన ఓటర్ల పేర్లు ఎన్నికల జాబితా నుంచి తొలగించారనే తీవ్ర సందేహాలు ఉన్నాయి. ఇది ఎన్నికల ప్రక్రియ నిష్పాక్షిత, పారదర్శకతపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. అదే సమయంలో గుర్తింపు, పౌరసత్వంపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అసలు ఎవరు భారతీయ ఓటరుగా గుర్తింపు పొందుతున్నారు? వారిని ఏ ప్రమాణాల ఆధారంగా గుర్తిస్తున్నారు? ఈ అంశంపై బీజేపీ స్పందించాల్సిన అవసరం ఉంది. అలాగే కేంద్ర ప్రభుత్వం డిటెన్షన్ క్యాంపులు ఏర్పాటు చేయాలని చూస్తోంది. నేను ఎప్పటికీ దాన్ని అనుమతించను. నా తర్వాత వచ్చే వారు కూడా అనుమతించరు' అని మమతా బెనర్జీ పేర్కొన్నారు.

**అనుబంధ ఓటర్ల జాబితాలపై సందేహాలు**

అంతకుముందు కూడా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్? (ఎస్?ఐఆర్??) ప్రక్రియపై కూడా మమతా బెనర్జీ విమర్శలు చేశారు. ఈసీ, బీజేపీలు కలిసి ప్రజల ఓటు హక్కులను తొలగించే ప్రయత్నం చేస్తున్నాయని ఆమె ఆరోపించారు. ఈసీ అధికారిక పత్రంపై బీజేపీ గుర్తు కనిపిస్తోందని అన్నారు. ఇది కేవలం కేరళకే కాకుండా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు వర్తిస్తుందని స్పష్టం చేశారు. దీనిని మానవతప్పిదం అని చెప్పి తప్పించుకోలేరని అన్నారు. అదనంగా, అనుబంధ ఓటర్ల జాబితాలు బ్లాక్, జిల్లా స్థాయిలో అందుబాటులో లేవని మమతా బెనర్జీ ఆరోపించారు. ఎస్?ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన మరణాల సంఖ్య 200 దాటిందని పేర్కొన్నారు. ఇప్పుడు నిజం బయటపడిందని, జాబితాలు రాత్రివేళ ప్రచురించడం ఎందుకు? అని ప్రశ్నించారు. ఇంకా బ్లాక్, జిల్లా స్థాయిలో జాబితాలు ఉంచలేదని తెలిపారు. ప్రజలకు తమ ఓటు స్థితి తెలియడం లేదని అన్నారు. తాజాగా ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు.

**సుప్రీంకోర్టు జోక్యంతో జాబితాలో పేర్లు- కానీ పారదర్శకత లోపం**

సుప్రీంకోర్టు జోక్యం తర్వాత కొంతమంది పేర్లు ఓటర్ల జాబితాలో చేర్చినప్పటికీ, మొత్తం ప్రక్రియ పారదర్శకంగా లేదని మమతా బెనర్జీ విమర్శించారు. తాము సుప్రీం కోర్టులో వేసిన కేసు వల్లే కొన్ని పేర్లు జాబితాలో చేర్చినట్లు చెప్పారు. అయితే పూర్తి జాబితాను స్పష్టంగా ప్రకటించడంపై ఈసీ ఎందుకు వెనకడుగు వేస్తోందని అని ప్రశ్నించారు. జాబితాను ప్రచురించడానికి ఈసీకి 6–7 రోజులు ఎందుకు పట్టింది? ఆ సమయంలో ఒక ప్రత్యేక పార్టీకి చెందిన ఓటర్లను చేర్చారా? పూర్తి జాబితా వెలువడితేనే నిజాలు బయటపడతాయని అన్నారు.

**ఎన్నికల ముందు ఐక్యతకు పిలుపు**

త్వరలో బంగాల్? అసెంబ్లీ ఎన్నికల జరగనున్న నేపథ్యంలో, ఒక పార్టీ (బీజేపీ) ఆధిపత్యంకు వ్యతిరేకంగా అన్ని రాజకీయ పార్టీలు ఐక్యంగా నిలవాలని మమతా బెనర్జీ పిలుపునిచ్చారు. కేంద్ర సంస్థలను రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగిస్తున్నారని ఆరోపిస్తూ, ఎన్నికల ప్రక్రియ స్వేచ్ఛగా, న్యాయంగా కొనసాగేందుకు ఈ ఐక్యత అవసరమని ఆమె స్పష్టం చేశారు. బంగాల్ అసెంబ్లీలో 294 స్థానాలకు ఏప్రిల్ 23, 29 తేదీల్లో రెండు విడతల్లో శాసనసభ ఎన్నికలు జరగనున్నాయి. మే 4న ఓట్ల లెక్కింపు ఉంటుంది. ఇక ఇటీవల ఎస్?ఐఆర్? ప్రక్రియ తర్వాత బంగాల్?లో తొలి సప్లిమెంటరీ ఓటర్ల జాబితాను ఈసీ విడుదల చేసింది. ఇందులో పోలింగ్ బూత్‌ల వారీగా ఓటర్ల జాబితాలను పొందుపరిచారు. ఈ జాబితాను ఈసీ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

## 1500 ఏళ్ల నాటి ఐరన్ పరిశ్రమ అవశేషాలు లభ్యం

# అప్పట్లోనే అఫ్గానిస్థాన్‌కు ఎగుమతులు!

1500 ఏళ్ల నాటి పురాతన ఇనుప పరిశ్రమ అవశేషాలను కనిపెట్టారు పరిశోధకులు. ఒడిశా సంబల్?పుర్? జిల్లాలోని రౌఢాఖోల్, బేత్?గఢ్?, లౌపాంక్? గ్రామాల పరిధిలో వీటిని గుర్తించారు. ఈ ప్రాంతంలో జరిపిన సర్వేలో పురాతన ఇనుప పరిశ్రమకు చెందిన సుమారు 20 అవశేషాలను కనుగొన్నారు. సంబల్?పుర్?లోని గంగాధర్ మెహర్ విశ్వవిద్యాలయ చరిత్ర విభాగం నిర్వహించిన పరిశోధనలో ఈ విషయం వెల్లడైంది. చరిత్ర విభాగాధిపతి, పురావస్తు శాస్త్రవేత్త డాక్టర్ అతుల్ కుమార్ ప్రధాన్ ఆధ్వర్యంలో ఈ పరిశోధనలు చేపట్టారు. ప్రస్తుతం సంబల్?పుర్? జిల్లాలోని రౌఢాఖోల్‌లోని భీమ్మండల్‌లో భారత పురావస్తు శాఖ (ఏఎస్?ఐ) ఆధ్వర్యంలో తవ్వకాలు జరుగుతున్నాయి.

"రౌఢాఖోల్‌లోని లౌపంక్, బెత్‌గఢ్ ప్రాంతాల్లో ఒక పురాతన ఇనుప పరిశ్రమ కర్మాగారం అవశేషాలను కనిపెట్టాము. దీనిని ఆధారంగా ఈ ప్రాంత ప్రజలు ఇనుము తయారీలో నైపుణ్యం కలిగి ఉన్నట్లు అర్థమవుతోంది. ఒకప్పుడు ఈ ప్రాంతం ఇనుప ఖనిజంతో సమృద్ధిగా ఉండేది. ఇక్కడి ప్రజలు ఇనుము తయారీలో నిపుణులు. వారు సంప్రదాయ పద్ధతిలో ఇనుప ఖనిజాన్ని వేడి చేసి కరిగించి ఇనుమును ఉత్పత్తి చేసేవారు. ఇక్కడ పరిశోధన చేయగా ఇనుముతో పాటు ఇనుము తయారీ సమయంలో లభించే వ్యర్థ పదార్థాలు లభించాయి."

**దేశంతో పాటు అఫ్గానిస్థాన్? లాంటి విదేశాలకు ఎగుమతి**



రౌఢాఖోల్ రాజుల కాలం నాటి పత్రాల నుంచి తాము చాలా విషయాలు తెలుసుకున్నామని పరిశోధకులు డాక్టర్ అతుల్ కుమార్ ప్రధాన్ చెప్పారు. ఈ ప్రాంతంలోని ఇనుము అత్యుత్తమ నాణ్యతతో ఉండేదని, దీనికి చాలా గిరాకీ ఉండేదని వివరించారు. ఈ ప్రాంతంలో ఉత్పత్తి అయిన ఇనుమును దేశంలోని వివిధ రాష్ట్రాలతో పాటు ఆఫ్గానిస్థాన్?తో సహా మరికొన్ని దేశాలకు ఎగుమతి అయినట్లు రికార్డుల్లో ఉందన్నారు.

కార్బన్ డేటింగ్ చేస్తే 2000 ఏళ్ల నాటిదనే తేలే అవకాశం

"ఇప్పటికే మేము చేపట్టిన ప్రాథమిక అధ్యయనంలో ఇది 1000 సంవత్సరాల నాటిదని తేలింది. కానీ దీనిని తవ్వి కార్బన్ డేటింగ్ చేస్తే సుమారు 2000 సంవత్సరాల నాటిదని రుజువవుతుంది. ఈ ప్రాంత ప్రజలు ఇనుప ఖనిజాన్ని రాయితో కొట్టి, దాని లోహపు శబ్దం ద్వారా దాని నాణ్యతను గుర్తించేవారు. ఇనుముతో వివిధ పనిముట్లు, చేతి ఆయుధాలు తయారు చేసేవారు." అని పురావస్తు శాస్త్రవేత్త డాక్టర్ అతుల్ కుమార్ ప్రధాన్ అన్నారు. రౌఢాఖోల్ పురాతన కోటలో తవ్వకాలకు భారత పురావస్తు శాఖ (ఏఎస్ఐ) ఇప్పటికే అనుమతి ఇచ్చిందని డాక్టర్ అతుల్ కుమార్ ప్రధాన్ చెప్పారు. అయితే మరిన్ని తవ్వకాల కోసం ఏఎస్ఐకి దరఖాస్తు చేసుకుంటామని తెలిపారు. ఇప్పటికే రౌఢాఖోల్‌లోని భీమ్మండల్‌లో పురావస్తు శాఖ పరిశోధనలు జరుగుతుండగా, బెత్‌గఢ్, లౌపంక్ పంచాయతీ పరిధిలో ఈ పురాతన ఇనుము పరిశ్రమ అవశేషాలను కనుగొన్నారు. "ఈ ప్రాంత ప్రజలు పెద్ద కొలిమిల్లో హెమటైట్ రాళ్లను వేడి చేసి వాటిని కరిగించి నాణ్యమైన ఇనుము, ఇనుప ఖనిజాన్ని వేరు చేయడంలో నిపుణులు. దీనిపై పరిశోధన చేయడం ద్వారా ఈ ఇనుప కళ ఎంత పురాతనమైనదో కచ్చితమైన సమాచారాన్ని పొందేందుకు ప్రయత్నిస్తాం. ఇక్కడ ట్రక్కుల పరిమాణం లాంటి పెద్ద కొలిమిలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా, ఈ ప్రాంతంలోని ఐరన్ పంచాయత్ వంటి అనేక గ్రామాల పేర్లు ఇనుముతో ముడిపడి ఉన్నాయి" అని అతుల్ కుమార్ ప్రధాన్ తెలిపారు.

## 'పాకిస్థాన్‌లాగా భారత్ బ్రోకర్ కంట్రీ కాదు'



అమెరికా–ఇరాన్ కాల్పుల విరమణ చర్చలకు మధ్యవర్తిత్వం వహించేందుకు సిద్ధమన్న పాకిస్థాన్‌పై భారత విదేశాంగమంత్రి ఎస్. జైశంకర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. పాకిస్థాన్‌ను ఒక దళారీ దేశంగా అభివర్ణించారు. అఖిలపక్ష సమావేశం అనంతరం మాట్లాడిన ఆయన పాక్ మాదిరి దళారీ దేశంగా భారత్ ప్రవర్తించదని స్పష్టంచేశారు. పాక్ చేస్తున్న ప్రయత్నాల్లో కొత్తేమీ లేదని అభిప్రాయపడ్డారు. 1981 నుంచి పాకిస్థాన్‌ను అమెరికా ఉపయోగించుకుంటుందన్నారు. భారత్ తన సొంత ప్రయోజనాలను కాపాడుకుంటూనే చర్చలు, దౌత్యం ద్వారా సమస్యల పరిష్కారానికి మొగ్గు చూపుతుందని, ఎవరికో మధ్యవర్తిగా పనిచేయడం తమ విధానం కాదని జైశంకర్ పేర్కొన్నారు. అంతకు ముందు, అమెరికా, ఇరాన్ మధ్య అర్థవంతమైన, వాస్తవికమైన చర్చలను నిర్వహించేందుకు తాము సిద్ధమని పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ ప్రకటించారు. పశ్చిమాసియా యుద్ధాన్ని ఆపే ఈ సంప్రదింపులను నిర్వహించే అవకాశం లభిస్తే, దాన్నొక గౌరవంగా భావిస్తామని ఆయన వెల్లడించారు. అమెరికా, ఇరాన్‌ల వైపు నుంచి ఉమ్మడి అంగీకారం లభిస్తే చర్చలకు మధ్యవర్తిగా వ్యవహరించేందుకు పాక్ సిద్ధంగా ఉంటుందన్నారు. ఈ యుద్ధాన్ని ఆపేందుకు, పశ్చిమాసియాలో శాంతి, సుస్థిరతల పరిరక్షణకు ప్రస్తుతం జరుగుతున్న అన్ని ప్రయత్నాలను పాకిస్థాన్ స్వాగతిస్తుందని షెహబాజ్ షరీఫ్ పేర్కొన్నారు. ఈమేరకు మంగళవారం ఆయన ఒక ట్వీట్ చేశారు.

**మధ్యవర్తులుగా పాక్, తుర్కియే, ఈజిప్ట్**

రహస్యంగా జరుగుతున్న అమెరికా, ఇరాన్ శాంతి చర్చలకు పాకిస్థాన్, తుర్కియే, ఈజిప్ట్ మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్నాయి అంటూ ఇటీవలే మీడియాలో కథనాలు వచ్చాయి. ఇప్పుడు పాక్ ప్రధాని చేసిన ప్రకటన, ఆ కథనాలకు బలం చేకూర్చేలా ఉందని అంతర్జాతీయ వ్యవహారాల పరిశీలకులు అంటున్నారు.

శాంతి చర్చలకు వేదికగా పాకిస్థాన్

అమెరికా, ఇరాన్ మధ్య శాంతి చర్చలకు వేదికగా పాకిస్థాన్‌ను ఎంపిక చేస్తారంటూ పలు అంతర్జాతీయ మీడియా సంస్థలు కథనాలను ప్రచురించాయి. అయితే ఈ ఊహాగానాలను నమ్మొద్దని, అధికారిక ప్రకటనలు వెలువడే వరకు వేచి చూడాలని మీడియాకు పాకిస్థాన్ విదేశాంగ శాఖ సూచించింది. దౌత్యం, చర్చల ద్వారానే పశ్చిమాసియా సైనిక ఘర్షణను ఆపగలుగుతామని పేర్కొంది.

# పాకిస్థాన్‌కు గూఢచర్యం

**ముఠాలో మరో ముగ్గురిని అరెస్టు చేసిన పోలీసులు**

**పాకిస్థాన్‌కు రహస్య సమాచారం పంపిన గ్యాంగ్‌పై పోలీసుల ఫోకస్**

**మరో ముగ్గురు అరెస్ట్‌తో మొత్తం 21కి చేరిన నిందితులు**

**ప్రతి సమాచారానికి రూ.5,000 చెల్లింపులు**



పాకిస్థాన్‌కు గూఢచర్యం చేస్తున్న ఓ ముఠాను ఇటీవల ఉత్తర్?ప్రదేశ్? పోలీసులు గుర్తించి, అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అయితే, ఆ కేసులో మరో ముగ్గురిని ఘాజియాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. దీంతో ఈ కేసులో అరెస్టయిన వారి సంఖ్య 21కి చేరిందని అధికారులు తెలిపారు. మార్చి 13న మొదటిసారిగా ఈ రాకెట్‌ను ఛేదించిన ఘాజియాబాద్ పోలీసులు, అప్పటి నుంచి ఈ నెట్‌వర్క్‌లోని ఒక్కొక్కరిని అరెస్టు చేస్తున్నారు. త్షజాగా అరెస్టయిన వారిలో బిహార్‌లోని భాగల్‌పూర్‌కు చెందిన సమీర్ అలియాస్ షూటర్ ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ గూఢచర్యంలో ఇతను ప్రధాన పాత్రధారిగా గుర్తించారు. సమీర్ ప్రస్తుతం దిల్లీలో నివసిస్తున్నాడు. భారత్?లోని కీలక సమాచారాన్ని పాక్ హ్యాండ్లర్లకు సమాచారం అందించడంలో సమీర్ కీలకంగా వ్యవహరిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. సమీర్?తో పాటు షామ్లీకి చెందిన సమీర్, షాజహాన్‌పూర్‌కు చెందిన శివరాజ్‌లను కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసును నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ(ఎన్ఐఏ) కూడా విచారిస్తోందని అధికారులు పేర్కొన్నారు. ఘాజియాబాద్ పోలీసులు ఇప్పటికే ఈ కేసుపై జిల్లా కోర్టులో చార్జ్‌షీట్ కూడా దాఖలు చేశారు.

**పాకిస్థాన్‌కు రహస్య సమాచారం చేరవేత**

ఈ గూఢచారి రాకెట్‌ను పాకిస్థాన్ నుంచి సర్దార్ అలియాస్ జోరావర్ సింగ్ అనే వ్యక్తి నడుపుతున్నట్లు అదనపు పోలీస్ కమిషనర్ రాజ్ కరణ్ నాయర్ తెలిపారు. భారత్‌లో ఉన్న నిందితులు సోషల్ మీడియా వేదికల ద్వారా సర్దార్‌తో నిరంతరం టచ్‌లో ఉండేవారని వెల్లడించారు. ఇక్కడ సేకరించిన ఫోటోలు, వీడియోలు, భద్రతా బలగాల కదలికలను ఎన్‌క్రిప్టెడ్ యాప్‌ల ద్వారా పాకిస్థాన్‌కు పంపినట్లు చెప్పారు. ఈ ముఠాను భారత్‌లో సుహైల్ అలియాస్ రోమియో అనే వ్యక్తి నడిపిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. రోమియో ఉత్తరప్రదేశ్‌లోని బిజ్నోర్ నివాసి. ఇతని కింద పలువురు పనిచేస్తున్నారు. హర్యానాలోని ఫరీదాబాద్‌కు చెందిన నౌషాద్ అలీ దిల్లీలోని పోలీస్ ఇన్స్టాలేషన్లు, రైల్వే స్టేషన్ల వద్ద రెక్కీ నిర్వహించేవాడు. ఈయన ఫరీదాబాద్‌లోనే ఉంటూ కీలక ప్రాంతాల వీడియోలను పాకిస్థాన్‌కు పంపేవాడు. మథురకు చెందిన మీరా ఠాకూర్ సోషల్ మీడియా ద్వారా సుహైల్?కు పరిచయమైంది. 2025లో ఈమె ఆయుధాల అక్రమ రవాణా కేసులో దిల్లీ స్పెషల్ సెల్ చేతికి చిక్కింది. తాను ముంబై పోలీసులకు ఇన్ఫార్మర్‌గా పనిచేస్తున్నానని నమ్మబలుకుతూ ఈ గూఢచారి కార్యకలాపాలు సాగించేది. సుహేల్ మాలిక్, ప్రవీణ్, రాజ్ వాల్మీకి, శివ వాల్మీకి, రితిక్ గంగ్వార్ వంటి వారు ఈ గుఢచర్యంలో వివిధ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ కేసులో అరెస్టు అయిన వారిలో ఆరుగురు మైనర్లు ఉన్నారు. దర్యాప్తు సంస్థలకు అనుమానం రాకుండా ఉండేందుకు ఈ ముఠా ఒక వ్యూహాత్మకంగా మైనర్లను తమ టీమ్?లోకి రిక్రూట్ చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. తక్కువ చదువుకున్న, పేదరికంలో ఉన్న హిందూ మైనర్ బాలురను తమ నెట్‌వర్క్‌లోకి చేర్చుకోవాలని పాక్?లోని ఆర్గనైజర్ చెప్పడంతో వారినే రిక్రూట్ చేసుకున్నారు. దిల్లీలోని కాంటోన్మెంట్ రైల్వే స్టేషన్ వంటి అత్యంత సున్నితమైన ప్రాంతాల్లో సోలార్‌తో పనిచేసే సీసీటీవీ కెమెరాలను రహస్యంగా అమర్చడానికి కూడా ఈ మైనర్లనే ఉపయోగించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

**ఫోటోకు రూ.5000**

ఈ గూఢచారి ముఠాకు నిధులు ఎలా వచ్చేవి అన్నకోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టగా ఆసక్తికర విషయం వెలుగులోకి వచ్చింది. పాకిస్థాన్ నుంచి పంజాబ్ సరిహద్దుల మీదుగా నిధులు భారత్‌లోకి వచ్చేవని గుర్తించారు. బ్యాంకు అకౌంట్ల ద్వారా లావాదేవీలు జరిగితే పట్టుబడతామనే భయంతో చిన్న చిన్న కిరాణా షాపులు, మనీ ట్రాన్స్‌ఫర్ సెంటర్ల అకౌంట్లను వీరు వాడుకున్నట్లు పోలీసులు తెలిపారు. పాక్?లోని హ్యాండర్లు భారత్?లోని ముఠాకు ఒక్కో సమాచారం లేదా ఫోటోకు 5,000 వరకు ఇచ్చేవారిని పోలీసులు గుర్తించారు. ఒకేసారి పెద్ద మొత్తాన్ని పంపితే అనుమానం వస్తుందని, వ్యూహాత్మంగా చిన్న మొత్తంలో పంపినట్లు భారత్?లోని ముఠాకు పాక్? హ్యాండ్లర్లు పంపినట్లు విచారణలో తేలింది.

# బంకులు.. బారులు

-మొదటిపేజీ తరువాయి

బోర్డులు కన్పిస్తున్నాయి. పశ్చిమాసియాలో యుద్ధం, చమురు, సహజ వాయువుల కొరత వార్తల నేపథ్యంలో ఈ నో స్టాక్ బోర్డులు ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్నాయి. వాహనదారులు అవసరం ఉన్నా, లేకపోయినా డీజిల్, పెట్రోల్ ట్యాంక్ నిండా నింపుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. సాధారణంగా ఏరోజు కారోజు ఇంధనం నింపుకునే క్యాబ్ డ్రైవర్లు, ఇతర గిగ్ వర్కర్లు, సామాన్య ప్రజలు కూడా ఎంతో కొంత అదనంగా ట్యాంకు నింపుకోవాలని చూస్తుండటంతో తెరిచి ఉన్న బంకుల వద్ద క్యూలు పెరిగిపోతున్నాయి. కొందరు సీసాలు, పెద్దపెద్ద క్యాన్లు, డ్రమ్ముల్లో సైతం ఇంధనం నిల్వ చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో కొన్ని బంకులు మూతపడి కన్పిస్తుండటంతో వాహనదారుల్లో ఆందోళన రెట్టింపవుతోంది. బంకులు మూత పడి ఉండటానికి 'నో క్రెడిట్' సమస్య ప్రధాన కారణమని తెలుస్తుండగా..ప్రభుత్వాలు, ఆయిల్ కంపెనీల ప్రకటనలను పట్టించుకోకుండా ప్రజలు ఎక్కడ పెట్రోల్, డీజిల్ దొరుకుతోందో తెలుసుకొని మరీ కొనుగోళ్లు చేస్తుండటంతో తెరిచి ఉన్న బంకులు కిక్కిరిసిపోయి కన్పిస్తున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

### సోమవారం నుంచే..

పశ్చిమాసియాలో యుద్ధం ఎప్పుడో మొదలైనా..సోమవారం సాయంత్రం నుంచే బంకుల వద్ద డీజిల్, పెట్రోల్ కోసం వాహనదారులు క్యూలు కట్టడం ప్రారంభించారు. ఆ ఫొటోలు టీవీలు, సోషల్ మీడియాలో ప్రసారం కావడంతో చమురు కొరతపై భయాందోళనలు మొదలయ్యాయి. బంకులన్నీ వాహనదారులతో నిండిపోవడం మొదలయ్యింది. మంగళ, బుధవారాల్లో కూడా ఇదే పరిస్థితి కొనసాగింది.

### భారీగా పెరిగిన డిమాండ్

ఇంధన కంపెనీల లెక్కల ప్రకారం రాష్ట్రంలోని సుమారు 3,600 పెట్రోల్ బంకులకు సాధారణంగా రోజుకు సగటున 13,752 కిలోలీటర్ల ఇంధనం అవసరం ఉంటుంది. తదనుగుణంగా ఆయిల్ కంపెనీలు సగటున 14,729 కిలోలీటర్లు సరఫరా చేసేవి. కానీ ప్రస్తుతం డిమాండ్ ఒక్కసారిగా 17,246 కిలోలీటర్లకు చేరింది. దీనికి అనుగుణంగా ఆయిల్ కంపెనీలు కూడా సరఫరాను 17,898 కిలోలీటర్లకు పెంచినట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. కానీ ఇప్పటికీ కొన్ని బంకులు నోస్టాక్ బోర్డులతో మూతపడి కన్పిస్తున్నాయి. మరికొన్ని బంకులు వాహనాలతో కిక్కిరిసి ఉంటున్నాయి. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో రెండు రోజుల్లో రెట్టింపు స్థాయిలో పెట్రోల్ విక్రయాలు పెరిగినట్లు అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ నెల 22న 3,024 కిలోలీటర్ల ఇంధనం విక్రయాలు జరగ్గా, 23న ఇది రెట్టింపై 6,400 కిలోలీటర్లకు చేరుకుంది.

### వచ్చిన స్టాక్ వచ్చినట్టు ఖాళీ

హైదరాబాద్, రంగారెడ్డితో పాటు మహబూబ్‌నగర్, కరీంనగర్, నిజామాబాద్, నల్లగొండ ఉమ్మడి జిల్లాల్లో కూడా ఇంధనానికి అగచాట్లు ఎదురవుతున్నాయి. పరిశ్రమలు, రవాణా ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో డీజిల్ వినియోగం గణనీయంగా పెరిగింది. వినియోగం పెరగడంతో ఉదయం వచ్చిన స్టాక్ అదే రోజు ఖాళీ అవుతోంది. దీంతో పలు పెట్రోల్ బంకులు మధ్యాహ్న?ననికే 'నో స్టాక్' బోర్డులు పెట్టేస్తున్నాయి.

### హైదరాబాద్‌లో ట్రాఫిక్ జామ్‌లు

హైదరాబాద్ నగరంలో పరిస్థితి మరింత తీవ్రంగా ఉంది. ఉదయం నుంచే వాహనదారులు బంకుల వద్దకు చేరుకోవడంతో ప్రధాన రహదారులపై ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో పోలీసులు రంగంలోకి దిగాల్సి వస్తోంది. ఐటీ కారిడార్‌లోని మాదాపూర్, గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డి?రస్టిక్ట్ ప్రాంతాల్లోని పెట్రోల్ బంకులన్నీ బుధవారం ఉదయం నుంచే వాహనదారులతో నిండిపోగా, ట్రాఫిక్ పోలీసులు రంగ ప్రవేశం చేశారు. గచ్చిబౌలిలోని ప్యారడైజ్ వద్ద ఉన్న పెట్రోల్ బంక్‌ను పోలీసులే మూసివేయించినట్లు ఖాన్ అనే వైద్యుడు 'సాక్షి'కి తెలిపారు. కొన్ని బంకుల వద్ద గంటల తరబడి వేచి చూసిన తర్వాత స్టాక్ అయిపోయిందని చెబుతున్న పరిస్థితి ఉంది. దీంతో సాధారణ ప్రజలతో పాటు హైదరాబాద్ నగరంలో వేల సంఖ్యలో ఉన్న ఆన్‌లైన్‌లో ఆహారం, నిత్యావసరాలు, ఇతర వస్తువులు చేరవేసే కార్మికులు, ఉబర్, రాపిడోల వంటి ద్వారా సేవలందించే క్యాబ్ డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలు జిల్లాల్లో సైతం వాహనదారుల్లో ఆందోళన కొనసాగుతోంది.

### క్యాన్లలో పెట్రోల్‌తో ప్రమాదం

డీజిల్, పెట్రోల్ కొరత లేదంటున్న ప్రభుత్వాలు, ఆయిల్ కంపెనీలు..ఈ విషయంతో పాటు వాస్తవ పరిస్థితులపై ప్రజలకు అవగాహన కల్పించాలని, వారు ఇబ్బందులు పడకుండా చూడాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. క్యాన్లలో పెట్రోల్ పోయవద్దని బంకుల యజమానులకు అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ప్రజలు కూడా కేవలం అవసరమైన మేరకే ఇంధనాన్ని కొనుగోలు చేయాలని, క్యాన్లలో నిల్వ ఉంచుకోవడం ప్రమాదకరం, చట్ట విరుద్ధం అని పేర్కొంటున్నారు.

### నో క్రెడిట్..అడ్వాన్స్ పేమెంట్‌తో అసలు సమస్య!

రాష్ట్రంలో ఇంధనం కొరత లేదని ఆయిల్ కంపెనీలు చెబుతున్నాయి. ఇక డీలర్లు కూడా సంక్షోభానికి కారణం కొరత కాదని, ఆయిల్ కంపెనీలు తీసుకొచ్చిన కొత్త నిబంధనలేనని పేర్కొంటుండటం గమనార్హం. వారి కథనం ప్రకారం.. పశ్చిమాసియాలో యుద్ధం నేపథ్యంలో.. గతంలో ఉన్న 'క్రెడిట్' సౌకర్యాన్ని రద్దు చేసి, 'అడ్వారీన్స్ పేమెంట్' పద్ధతిని అమలు చేస్తుండటంతో బంకుల యజమానులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు లక్షల్లో పేరుకు పోయిన పాత బకాయిలు కూడా సమస్య తీవ్రతకు కారణమవుతున్నట్లు తెలిసింది. పాత బకాయిలు చెల్లిస్తేనే కొత్త స్టాక్ ఇస్తామన్న కంపెనీల నిబంధనతో పలు బంకులు ఆర్డర్లు ఇవ్వలేకపోతున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలోనే బంకులు మూత పడుతున్నాయి. నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. ఇది చూసి తెరిచి ఉన్న బంకులకు వాహనదారులు రెండు, మూడు రెట్ల ఎక్కువ సంఖ్యలో పోటెత్తుతుండటంతో..క్రెడిట్, ఇతర సమస్యల్లేని ఆ బంకుల్లో స్టాక్ గంటల్లోనే ఖాళీ అవుతోంది.

### పెట్రోల్, డీజిల్ కొరత లేదు: పౌరసరఫరాల శాఖ కమిషనర్

'రాష్ట్రంలో ఎక్కడా పెట్రోల్, డీజిల్ కొరత లేదు. రాష్ట్రంలో ఇప్పటికీ సుమారు 20 వేల కిలోలీటర్ల పెట్రోల్ అందుబాటులో ఉంది. సరఫరా వ్యవస్థలో కూడా ఎలాంటి అంతరాయం లేదు. మంగళవారం ఒక్కరోజే 1,500 పెట్రోల్, డీజిల్ ట్యాంకర్లను పంపించాం. వాహనదారులు అనవసరంగా ఎక్కువ పెట్రోల్ నిల్వ చేసుకోవద్దు..' అని పౌరసరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర స్పష్టం చేశారు. ప్రజలు భయాందోళనలకు గురికావాల్సిన అవసరం ఎంతమాత్రం లేదని, అవసరం లేకుండా ఆయిల్ కొనుగోలు చేయవద్దని (ప్యానిక్ కొనుగోళ్లు) మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సూచించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆయిల్ కంపెనీల ప్రతినిధులు, పౌరసరఫరాల శాఖ అధికారులతో ఇంధన నిల్వలపై సమీక్ష జరిపారు.

### తప్పుడు ప్రచారం నమ్మొద్దు: హైదరాబాద్ సీపీ

'హైదరాబాద్‌లో ఇంధనం కొరత లేదు. తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దు. నగరంలో దాదాపు 60 రోజులకు సరిపడా పెట్రోల్, డీజిల్ నిల్వలు అందుబాటులో ఉన్నాయి. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదు. నగర వ్యాప్తంగా చమురు సరఫరా నిరాటంకంగా కొనసాగుతోంది. అవసరానికి మించి కొనుగోలు చేయొద్దు. కేవలం వదంతుల వల్లే రద్దీ ఏర్పడుతోంది..' అని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ స్పష్టం చేశారు. ఎవరైనా కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవని హైదరాబాద్ కలెక్టర్ హరిచందన హెచ్చరించారు. నగరంలో తాజా పరిస్థితిపై బుధవారం టీజీసీసీసీలో వారు సమీక్ష జరిపారు.

### అవసరానికి మించి కొనుగోళ్లతో స్టాక్ ఖాళీ: డీలర్ల సంఘం


'ఇంధన కొరత అంటూ తప్పుడు వార్తలు ప్రచారం చేస్తుండటంతో వాహనదారులు పెట్రోల్ బంకుల వద్ద క్యూలు కడుతున్నారు. మళ్లీ ఆయిల్ దొరుకుతుందో లేదో అని అవసరానికి మించి కొనుగోలు చేస్తున్నారు. దీంతో స్టాక్ త్వరగా అయిపోతోంది. ప్రజలు వదంతులు నమ్మొద్దు. ప్యానిక్ కొనుగోళ్లు నిలిపివేయాలి. కంటైనర్లు, సీసాల్లో కూడా తీసుకోకూడదు..' అని తెలంగాణ పెట్రోలియం డీలర్ల సంఘం అధ్యక్షుడు ఎం.అమరేందర్‌రెడ్డి సూచించారు. 'పాత బకాయిలు చెల్లిస్తేనే ఆయిల్ కంపెనీలు ఇంధనం సరఫరా చేస్తున్నాయి. క్రెడిట్ (ఉద్దెర)లో పెట్రోల్, డీజిల్ ఇవ్వడం లేదు. ఇది కొన్ని బంకులు మూతపడటానికి, తెరిచి ఉన్నచోట క్యూలు పెరగడానికి కారణమవుతోంది..' అని విలేకరులు అడిగిన ఒక ప్రశ్నకు ఆయన జవాబిచ్చారు.

# విద్యుత్ కొనుగోలు వ్యయం తగ్గాల్సిందే

-మొదటిపేజీ తరువాయి

ఇప్పటికే సుమారు రూ.339 కోట్ల మేర ఆదా చేశామని, ఈ తరహా పొదుపు చర్యలను మరింతగా చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఇప్పుడు ఈ రంగంలో అనేక మార్పులు వస్తున్నాయని, ప్రపంచం గ్రీన్ ఎనర్జీ వైపు అడుగులు వేస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. రాబోయే రోజుల్లో విద్యుత్ రంగం గేమ్ ఛేంజర్ కానుందన్నారు. ప్రపంచ దేశాలు తక్కువ ఖర్చుతో పర్యావరణహిత ఉత్పత్తికి ఎంతగానో మొగ్గు చూపుతున్నాయని అధికారులకు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ అవకాశాలను అందిపుచ్చుకోవడం వల్లే గూగుల్ వంటి కంపెనీలు ఇక్కడ తమ ఉనికిని చాటుకోగలిగాయని ఆయన పేర్కొన్నారు. పీఎం సూర్య ఘర్ పథకం కింద రూఫ్?టాఫ్ ప్రాజెక్టుల ద్వారా విద్యుత్ ఉత్పత్తిపై దృష్టి సారించాలని సీఎం అన్నారు."పీఎం కుసుమ్?" పై రైతులకు అవగాహన కల్పించాలని దిశానిర్దేశం చేశారు.

ప్రజలపై భారం వేయకుండా అప్పులు తీర్చేలా: సౌర విద్యుత్ ఉత్పత్తి విషయంలో మన దేశంలోనే మొట్టమొదటి స్థానంలో ఉండేలా చర్యలు ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. వీటితో పంప్ స్టోరేజీ (ౠూ) ప్రాజెక్టులు, పవన



విద్యుత్ (విండ్ ఎనర్జీ), బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టం వంటి ప్రాజెక్టులను ఇంటిగ్రేట్ చేసుకోవాలనన్నారు. విద్యుత్ రంగంలోని టెక్నాలజీలను, ఇన్నోవేషన్లను ప్రొత్సహించేందుకు ఎనర్జీ యూనివర్శిటీని ఏర్పాటు చేయాలని ఆయన ప్రతిపాదించారు. విద్యుత్ సంస్థలపై రుణ భారం అత్యధికంగా పెరిగిందని ముఖ్యమంత్రి పేర్కొంటూ, ప్రజలపై ఎటువంటి ఆర్థిక భారం మోపకుండానే సంస్థలే ఈ రుణాలను తీర్చేలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ట్రూ అప్ ఛార్జీల భారం ప్రజలపై పడకుండా చూసేందుకు ఇప్పటికే తగిన చర్యలు తీసుకున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు.

### ఎనర్జీ యూనివర్సిటీని ఏర్పాటు:

సాంకేతికత అందిపుచ్చుకునేందుకు ఏర్పాటు చేసిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఎనర్జీ ట్రాన్సిషన్ ను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్యుత్ రంగంలో సాంకేతిక పురోగతిని, ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు ఎనర్జీ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. మంచి ఆలోచనలతో ముందుకు వచ్చే స్టార్టప్ సంస్థలకు అవసరమైన 'మార్జిన్ మనీ' మద్దతును అందించేందుకు విద్యుత్ సంస్థలు తగిన చర్యలు చేపట్టాలని ఆయన స్పష్టం చేశారు. ఈ ఉద్దేశంతో ఒక "ఇంక్యుబేషన్ ఫండ్"ని ఏర్పాటు చేయాలని సీఎం అన్నారు. 2028-29 నాటికి విద్యుత్ కొనుగోలు యూనిట్ ధరను రూ.4.10కి తగ్గించే దిశగా చర్యలు ప్రారంభించినట్లు అధికారులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు వివరించారు. ఈ సమావేశంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్, ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయనంద్, డిస్కం(విద్యుత్ పంపిణీ సంస్థ)ల సీఎండీలు, విద్యుత్ శాఖకు చెందిన సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

## రాజధాని అమరావతికి చట్టబద్ధత




-మొదటిపేజీ తరువాయి

సవరించాలని ఏపీకి సూచించింది. ఈ సూచన మేరకు ఈ నెల 28న శాసనసభలో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. అమరావతిని రాష్ట్ర రాజధానిగా ప్రకటిస్తూ తీర్మానం చేయనున్నారు. ఈ తీర్మానాన్ని ఏపీ ప్రభుత్వం కేంద్రానికి పంపనుంది. 2024 జూన్ 2 నుంచి అమరావతిని రాజధానిగా ప్రకటించాలని గతంలో ఏపీ కోరిన విషయం తెలిసిందే. ఈ పార్లమెంటు సమావేశాల్లోనే అమరావతిపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

## రాష్ట్రంలో గ్యాస్ కొరత లేదు - వదంతులు నమ్మొద్దు

పట్టణాల్లో ఎల్పీజీ సిలిండర్ల నుంచి పైప్డ్ నేచురల్ గ్యాస్ సిలిండర్ల వైపు వినియోగదారులను మళ్లించేలా కొత్త పాలసీని తీసుకొస్తున్నట్లు పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఈ విషయమై కేబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్లు స్పష్టం చేశారు. వన్? టైమ్ పాస్‌వర్డ్ ద్వారానే గ్యాస్ సరఫరా జరగాలని, సిలిండర్లు బ్లాక్ మార్కెటింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. రాష్ట్రంలో ఎక్కడా గ్యాస్ కొరత లేదన్న మంత్రి నాదెండ్ల మనోహర్, ప్రజలు వదంతులు నమ్మి ముందుజాగ్రత్తగా గ్యాస్ బుక్ చేస్తున్నారని తెలిపారు. 2.4 లక్షల గ్యాస్ బుకింగ్స్‌కు 5 లక్షల బుకింగ్స్ అవుతున్నాయని, సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు వార్తలు నమ్మొద్దని ప్రజలకు సూచించారు. వాణిజ్య అవసరాలకు ఇచ్చే గ్యాస్ సరఫరాను కేంద్రం 10 నుంచి 20 శాతం పెంచిందని మంత్రి వెల్లడించారు. వాణిజ్య సిలిండర్లు వాడేవారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రెస్టారెంట్లు, విద్యాసంస్థలకు సరఫరా పెంచేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పట్టణాల్లోని ప్రజలు పైప్డ్ గ్యాస్ కోసం నమోదు చేసుకోవచ్చని తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటికే 2.34 లక్షల మంది పైప్డ్ గ్యాస్ వినియోగించుకుంటున్నారన్న మంత్రి, పట్టణ ప్రాంతాలకు దీని కనెక్టివిటీ అందుబాటులో ఉందని పునరుద్ఘాటించారు. పట్టణాల్లో పైప్డ్ గ్యాస్ ఇంటింటికీ తరలింపునకు మరిన్ని పైపులు వేయాల్సి ఉందన్నారు. సోలార్, ఇండక్షన్ కుకింగ్ స్టౌవ్‌లను వినియోగించేలా చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రంలో ఎక్కడా పెట్రోల్ , డీజిల్ కొరత లేదని మంత్రి స్పష్టం చేశారు 'సిలిండర్ల బ్లాక్ మార్కెటింగ్ నివారణకు ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నాం. ఇప్పటికే సిలిండర్ల అక్రమాలపై 800 కేసులు నమోదయ్యాయి. 3,540 సిలిండర్లు సీజ్ చేశాం. అధిక ధరలకు విక్రయం, బ్లాక్ మార్కెటింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవు. కచ్చితంగా వన్‌టైమ్ పాస్‌వర్డ్ ద్వారానే గ్యాస్ సరఫరా జరపాలి. ఎవరైనా అక్రమంగా తరలిస్తున్నట్లు తెలిస్తే రాష్ట్ర స్థాయి టోల్‌ఫ్రీ నెం.1967 లేదా జిల్లా స్థాయిలో ఫిర్యాదు చేయవచ్చు.'

డీలిమిటేషన్‌పై సమగ్ర అధ్యయనం: జనాభా ప్రాతిపదికనే డీలిమిటేషన్ ప్రక్రియ జరుగుతుందన్న మంత్రి దీనిపై త్వరలో పార్టీలో సబ్ కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. కమిటీ ముందు ఉంచాల్సిన అంశాలను తమ పార్టీ తరపున చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. నష్టం ఉందా లేదా అనే అంశంపై అధ్యయనం చేశాకే అభిప్రాయాలు తెలుపుతామని మంత్రి నాదెండ్ల స్పష్టం చేశారు.

## ఎవరో ఎందుకు? నువ్వే పోటీ చెయ్!

-మొదటిపేజీ తరువాయి

ఓటు వేసేందుకు రాష్ట్రంలో ఏ ఒక్క వర్గం సిద్ధంగా లేదని దుయ్యబట్టారు. శాసనసభ లాబీలోని ప్రతిపక్ష నేత కార్యాలయంలో హరీశ్‌రావు బుధవారం మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. మాజీ మంత్రి జీవన్‌రెడ్డి రాజీనామా, బీఆర్ఎస్‌లో చేరికకు సంబంధించి స్పందిస్తూ 'వేచి చూడండి.. కొన్ని చెప్తే బాగుండవు.. చూస్తేనే బాగుంటాయి'అని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. 'అసెంబ్లీ, పార్లమెంటు నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్లను స్వాగతిస్తాం. మహిళా రిజర్వేషన్లపై గతంలోనే బీఆర్ఎస్ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసింది. దక్షిణాది రాష్ట్రాలపై ఉత్తరాదికి ఎప్పుడూ చిన్నచూపే ఉంటుంది. దక్షిణాది రాష్ట్రాలు కుటుంబ నియంత్రణ పాటించి, ప్రగతి దిశగా పనిచేస్తూ నష్టపోతున్నాయి'అని హరీశ్‌రావు చెప్పారు. ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించే ప్రైవేటు మెంబర్ బిల్లుపై స్పీకర్‌ను మరోమారు కలుస్తామన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో చర్చించేందుకు తాము 15 అంశాలు ప్రతిపాదించినా ఒక్కటీ పరిగణనలోకి తీసుకోలేదని మండిపడ్డారు. 'కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత 16 నోటిఫికేషన్ల ద్వారా 50,785 ఉద్యోగాలు నోటిఫై చేసి 16,978 మాత్రమే భర్తీ చేసినట్లు ఒప్పుకుంది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 36 సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేసి తొమ్మిదింటికి మాత్రమే అధ్యక్షులను నియమించింది. 17 బోర్డులకు కనీసం కార్యాలయాలు కూడా లేవు'అని హరీశ్‌రావు పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై చర్చించేందుకు అసెంబ్లీ సమావేశాలు మరో వారం రోజులు పొడిగించాలని డిమాండ్ చేశారు.

## పేదోడి ఇంటి కల నిజం చేసింది వైఎస్సార్

హైదరాబాద్: పేదవాడి ఆత్మగౌరవానికి చిహ్నంగా భావించే సొంతింటి కలను పెద్ద ఎత్తున నిజం చేసిన ఘనత దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శాసనసభలో స్పష్టం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆయన హయాంలోనే అత్యధికంగా 21 లక్షల ఇళ్లు పేదలకు కట్టించారని తెలిపారు. తిరిగి తమ ప్రభుత్వమే ఈ స్థాయిలో ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తోందని చెప్పారు. అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో కాటేపల్లి వెంకటరమణారెడ్డి, పాయల్ శంకర్ తదితరులు లేవనెత్తిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం అంశం సుదీర్ఘ చర్చకు దారితీసింది. అధికార, విపక్ష సభ్యులు ఈ అంశంపై పలు ప్రశ్నలు వేశారు. వీటన్నింటికీ మంత్రి పొంగులేటి బదులిచ్చారు. పేదలకు ఇళ్లు ఇచ్చే కార్యక్రమాన్ని తాము ప్రతిష్టాత్మకంగా తీసుకున్నామని చెప్పారు. 99 రోజుల ప్రణాళికలో దీనికే ప్రాధాన్యమిస్తున్నామన్నారు. ఏప్రిల్ మొదటి వారానికి 1.12 లక్షల ఇళ్లు అర్హులైన లబ్ధిదారులకు అందిస్తామన్నారు. వివిధ దశల్లో ఇళ్ల నిర్మాణం, పంపిణీ పూర్తి చేస్తామన్నారు. గత ప్రభుత్వ హయాంలో 2,31,206 ఇళ్లు మంజూరు చేశారని, వీటిల్లో 1,62,936 ఇళ్లు కొన్ని మౌలిక వసతులు మినహా పూర్తయినట్టు తెలిపారు. నాణ్యత విషయంలో వచ్చిన ఆరోపణలపై థర్డ్ పార్టీ విచారణ జరుగుతోందని, నివేదిక వచ్చిన తర్వాత బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేస్తున్నామని, దీనిద్వారా వచ్చే సందేహాలను వెంటనే నివృత్తి చేస్తామన్నారు.

### లబ్ధిదారులు నివాసం ఉండడం లేదు

ఇళ్లు కేటాయించినా, చాలాచోట్ల లబ్ధిదారులు నివాసం ఉండడం లేదని మంత్రి తెలిపారు. అధికారులతో దీనిపై ఇటీవల సమీక్షించినట్లు చెప్పారు. దీనిపై 6,500 మందికి నోటీసులిస్తే, 4,500 మంది మాత్రమే స్పందించారని వెల్లడించారు. మరో రెండు నెలల్లో లబ్ధిదారులు ఇళ్లలోకి వెళ్లకపోతే, ఆ ఇళ్లను అర్హులైన ఇతరులకు కేటాయిస్తామన్నారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోనే కేటాయించిన 12 వేల ఇళ్లలోకి లబ్ధిదారులు వెళ్లలేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఆగిపోయిన ఇళ్లను కూడా లబ్ధిదారులకు కేటాయిస్తామని, పాత కాంట్రాక్టర్లు పనులు చేయకపోతే ఇతరులకు అప్పగిస్తామని వెల్లడించారు. ఇందిరమ్మ కమిటీలు వేసినా, ఆ గ్రామ సర్పంచ్, పట్టణాల్లో వార్డు కౌన్సిలర్లకు అధికారాలుంటాయని చెప్పారు. వారి సిఫారసులను కలెక్టర్ పరిశీలిస్తారని, అంతిమంగా ఇన్‌చార్జి మంత్రి లబ్ధిదారులను ఎంపిక చేస్తారని తెలిపారు. బహుళ అంతస్తుల భవనాలు ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్ల ప్రాంతంలో షాపులను అమ్మడం కాకుండా, లీజుకు ఇవ్వాలన్న సభ్యుల ప్రతిపాదనను మంత్రి తోసిపుచ్చారు. లీజుకు తీసుకున్న వ్యక్తి అద్దె కట్టడని, ఖాళీ చేయడని, కొత్త సమస్యలు వస్తాయన్నారు. ఓపెన్ ఆక్షన్ ద్వారా అమ్మేసి, ఆ డబ్బును ఆ కాలనీ అసోసియేషన్, మున్సిపాలిటీ, లేదా గ్రామ పంచాయితీ జాయింట్ అకౌంట్‌లో ఉంచుతామన్నారు. వడ్డీతో అపార్ట్‌మెంట్ నిర్వహణ సాధ్యమవుతుందని చెప్పారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో పేదలకు ఇచ్చిన ఇళ్లపై ప్రజల నుంచి పూర్తి సంతృప్తి వచ్చిందని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. ఇళ్ళ కేటాయింపు, నిర్మాణాలపై శాసనసభ్యులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు. మంత్రి పొంగులేటి బదులిస్తున్న సమయంలోనూ 'రివ్యూ కమిటీ పెడుతున్నారా? లేదా?'అంటూ ఆయన ప్రశ్నించారు. త్వరలోనే సమీక్ష చేపడతామని మంత్రి బదులిచ్చారు.

## కూటమి ప్రభుత్వానికి ఓటమి తప్పదు

-మొదటిపేజీ తరువాయి

ఆర్భాటంగా ప్రచారం చేసుకున్నారు. నిజానికి 2022లో తన దావోస్ పర్యటనలో ఆదిత్య మిట్టల్‌ను కలిశానని, రాష్ట్రంలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటుపై అప్పుడే దాదాపు అవగాహన కుదిరిందని, తగిన భూమి ఇచ్చేందుకు కూడా అంగీకరించామని, అంతే కాకుండా అప్పుడే ఆ కంపెనీ కర్నూలు జిల్లాలో నిర్మాణంలో ఉన్న గ్రీన్‌కో ప్రాజెక్టులోనూ రూ.4800 కోట్ల పెట్టుబడికి అవగాహన కదుర్చుకుందని ఆయన వెల్లడించారు. ఆర్సెనాల్ మిట్టల్ స్టీల్ కంపెనీ గురించి అంతగా ప్రచారం చేసుకుంటున్న సీఎం చంద్రబాబు, అదే నక్కపల్లిలోని బల్క్ డ్రగ్ పార్క్ ప్రాజెక్ట్ గురించి ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. అసలు ఆ ప్రాజెక్టు ఏమైందని నిలదీశారు. దురుద్దేశంతో అక్కడ భూవివాదాన్ని సృష్టించిన చంద్రబాబు, దాన్ని ముందుకు సాగనివ్వడం లేదని చెప్పారు. జగన్ 2 లో పార్టీ కార్యకర్తలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తామన్న శ్రీ వైయస్ జగన్, నియోజకవర్గా ల పెంపు ఒక గుడ్‌న్యూస్ అని చెప్పారు. అసెంబ్లీ, పార్లమెంటు సీట్ల పెంపు హర్షణీయం అన్న ఆయన, దాని వల్ల ఎస్సీ, ఎస్టీ, మహిళలకు సీట్లు కూడా గణనీయంగా పెరుగుతాయని తెలిపారు. ఇంకా దాని వల్ల కార్యకర్తలు కూడా నాయకులుగా ఎదిగే అవకాశం వస్తుందని, ఉత్సాహం. పటిమ ఉన్న వారికి ప్రోత్సాహం ఇస్తామని చెప్పారు. ఎన్నికల ముందు చంద్రబాబు ఏం చెప్పారు? ఆ తర్వాత ఏం చేస్తున్నాడు.. అందరికీ తెలుసు. నాడు ఆయన ఏమన్నాడు. జగన్ ఇస్తున్నవన్నీ అలాగే అమలు చేయడమే కాకుండా, సూపర్‌సిక్స్, సూపర్ సెవెన్ కూడా ఇస్తానన్నాడు. కానీ, ఆ తర్వాత ఏం చేశారు? ఎన్నికలై పోగానే చంద్రబాబు మ్యానిఫెస్టోను చెత్తబుట్టలో వేశారు. ఇప్పుడు మూడు బడ్జెట్లు అయిపోయాయి. ఇంకా మిగిలినవి కేవలం రెండు మాత్రమే. కానీ ఏ పథకం అమలు లేదు. జగన్ ఇచ్చినవన్నీ పోయాయి. అన్నీ ఎగ్గొట్టాడు. చివరకు సూపర్‌సిక్స్, సూపర్‌సెవెన్ కూడా మోసాలయ్యాయి. బిర్యానీ కథ దేవుడెరుగు. ఉన్న పలావు పోయింది. దీన్ని ప్రజలు ఇంటింటా చర్చించుకుంటున్నారు. మన హయాంలో ఆ 5 ఏళ్లలో దాదాపు రూ.3.31 లక్షల కోట్ల అప్పు చేస్తే, అందులో రూ.2.73 లక్షల కోట్లు, డీబీటీ ద్వారా అక్కచెల్లెమ్మల ఖాతాలకు నేరుగా బదిలీ చేశాం. ఆధార్ నెంబర్లు, బ్యాంక్ ఖాతాలతో సహా ఎవరికి, ఎంతిచ్చామో చెప్పగలం. కానీ రెండేళ్లు కూడా కాకముందే చంద్రబాబు చేసిన మొత్తం అప్పులు రూ.3.37 లక్షల కోట్లు దాటాయి. కానీ, జగన్ ఇచ్చిన పథకాలు లేవు. ఇంకా సూపర్‌సిక్స్, సూపర్ సెవెన్ కూడా లేవు. అమరావతిలో చదరపు అడుగు నిర్మాణానికి రూ.11 వేలు ఖర్చు చేస్తున్నారు. బెంగళూరు, హైదరాబాద్ వంటి మహానగరాల్లో చదరపు అడుగు నిర్మాణానికి రూ.4 వేలతో ఫైవ్‌స్టార్ లెవెల్‌లో కట్టొచ్చు. కానీ ఇక్కడ ఏకంగా అదే చదరపు అడుగు నిర్మాణానికి రూ.11 వేలు ఖర్చు చేస్తున్నారు. ఇంకా భూములు శనక్కాయలు, బెల్లానికి ఇస్తున్నారు. చంద్రబాబు బంధువు, బాలకృష్ణ అల్లుడికి రూ.5 వేల కోట్ల విలువైన భూములు దోచి పెడుతున్నారు. ఈ రకంగా రాష్ట్ర ఆదాయాలు రాష్ట్రానికి రావడం లేదు. చంద్రబాబు పాలనంతా వైఫల్యం. కానీ, మాటలు కోటలు దాటుతాయి. కానీ చేతలుండవు. ఆయన చేస్తున్న దాన్ని క్రెడిట్ చోరీ కాకుండా క్రెడిట్ దోపిడి అనాలేమో. చంద్రబాబు ఇటీవలి క్రెడిట్ దోపిడి గురించి చెప్పాల్సి వస్తే.. ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్‌ను తాను తెచ్చినట్లు బిల్డప్ ఇస్తూ.. ఆర్భాటంగా జోరుగా ప్రచారం చేసుకుంటున్నాడు.

# సంపాదకీయం

## ఇరాన్‌పై కొనసాగుతున్న దాడులు

ఇరాన్‌పై ఏకపక్ష దాడులకు దిగిన అమెరికా తాత్కాలికంగా వెనక్కు తగ్గిందా? వెనక్కు తగ్గినట్టు ట్రంప్ గేమ్ ఆడుతున్నాడా పోరును ఆపేందుకు ట్రంప్ దారులు వెతుకుతున్నాడా? దానిలో భాగంగానే ఇరాన్‌లో ఇంధన వ్యవస్థలపై ఐదు రోజుల పాటు దాడులు నిలిపివేస్తున్నట్లు ప్రకటించాడా! అవన్నీ ఒట్టి మాటలే అని టెహ్రాన్ ఎందుకన్నది! ఇరాన్‌పై దాడులు 25వ రోజులో ప్రవేశించిన మంగళవారం నాడు ఇది రాస్తున్న సమయానికి ఉన్న సందేహాలు ఇవి. ఒక్కటి మాత్రం వాస్తవం. ఇరాన్‌పై దాడులను అమెరికా–ఇజ్రాయిల్ కూటమి ఇంకెన్ని రోజులో కొనసాగించే అవకాశాలు లేవన్నది అత్యధిక విశ్లేషకుల అభిప్రాయం. దాడులు దీర్ఘకాలం కొనసాగితే అమెరికన్లలో వ్యతిరేకత మరింత పెరుగుతుందని, నవంబరులో జరిగే పార్లమెంటు మధ్యంతర ఎన్నికల్లో ఓడిపోతే పదవీ కాలం పూర్తయ్యే వరకు ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుందనే భయంతో ట్రంప్ వెనకడుగు వేసేందుకు నిర్ణయించుకొని దారి వెతుక్కుంటున్నట్లు చెబుతున్నారు. దీనికి విరుద్ధంగా జరుగుతుందా? ఏమో! ఐదు రోజుల విరామం ప్రకటన చేసిన తరువాత కూడా సోమవారం రాత్రి, మంగళవారం నాడు దాడులు ఆగలేదు. అమెరికా బలహీనతలు, దాని ఎత్తుగడల వైఫల్యం గురించి పెద్ద ఎత్తున సాగుతున్న చర్చతో వెనక్కు తగ్గే అవకాశాలు ఉన్నాయనే విశ్లేషణలు వెలువడుతున్న సమయంలో ట్రంప్ 48 గంటల బెదిరింపు ప్రకటన చేశాడు. హోర్ముజ్ జలసంధిని పూర్తిగా తెరవకపోతే ఇరాన్ విద్యుత్ మౌలిక సదుపాయాలను ధ్వంసం చేస్తామని ప్రకటించాడు. అయితే ఆ గడువు ముగిసిన వెంటనే ఐదు రోజుల పాటు దాడులను వాయిదా వేస్తామంటూ నాటకీయంగా సోమవారం సాయంత్రం ప్రకటించాడు. తమపై దాడులకు మరింత మంది సైనికులను కూడ గట్టుకొనేందుకే ఈ ప్రకటన చేశాడని ఇరాన్ స్పందించింది. తమ విద్యుత్ సంస్థలపై దాడులు జరిపితే తలెత్తే పర్యవసానాలకు భయపడి ట్రంప్ ఆ ప్రకటన చేశాడని ఇరాన్ జాతీయ టీవీ, ఇతర మీడియా సంస్థలు పేర్కొన్నాయి. రెండు దేశాల మధ్య చర్చల గురించి ఎవరేం చెప్పినప్పటికీ తెర వెనుక సంప్రదింపులు జరుగుతున్నట్లు ఊహాగానాలు వెలువడ్డాయి. ఇరాన్‌పై దాడులకు ట్రంప్‌ను ఎవరు ప్రేరేపించారనే అంశంపై రకరకాల వార్తలు వచ్చాయి. అయితే సోమవారం నాడు ట్రంప్ టెన్నెసీలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో చేసిన వ్యాఖ్యలు రక్షణ మంత్రి పీట్ హెగ్‌సేత్‌పై నెపం మోపాయి. తన పక్కనే ఉన్న హెగ్‌సేత్‌తో ట్రంప్ మాట్లాడుతూ "వారు అణ్వాయుధాలను కలిగి ఉండకూడదంటే మనం వారిని వదల కూడదని నువ్వే కదా మొదట చెప్పింది" అన్నాడు. అంతా అధ్యక్షుడి చేతుల్లోనే ఉందన్నాడు తప్ప పీట్ ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. ఇతరులపై నెపం మోపటంలో ట్రంప్ ఘనుడు. ఇరాన్ చమురు క్షేత్రాలపై ఇజ్రాయిల్ జరిపిన దాడుల గురించి తనకు తెలియదని కొద్ది రోజుల క్రితం చెప్పాడు. ఇరాన్ ప్రతిఘటన ఇలా ఉంటుందని తనకెవరూ చెప్పలేదన్నాడు. ఇప్పుడు మరొక కొత్త కథ చెప్పాడు. రేపు ఇంకెన్ని చెబుతాడో చూద్దాం. ఫిబ్రవరి 28న ప్రారంభమైన దాడులు ఎప్పుడు ముగుస్తాయో తెలియదు. ఇప్పటి వరకు ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయిల్ దాదాపు రెండు వేల దాడులు జరిపినట్లు అంచనా. ఆపరేషన్ ఎపిక్ ఫురీ పేరుతో అమెరికా, రోరింగ్ లయన్ పేరుతో ఇజ్రాయిల్ తెగబడుతున్నాయి. వందకు పైగా విమానాలను దాడులకు వినియోగించినట్లు చెబుతున్నారు. అత్యధిక దాడులు రాజధాని టెహ్రాన్ నగరం మీదే జరిగాయి. ఈ దాడులతో భారీగా నష్టపోయినప్పటికీ ఇరాన్ ఎందుకు వెనక్కు తగ్గటం లేదన్నది యావత్ ప్రపంచంలో చర్చగా ఉందంటే అతిశయోక్తి కాదు. సుప్రీమ్ నేత అయాతుల్లా అలీ ఖమేని, ఇతర అనేక మంది ప్రముఖులను పోగొట్టుకున్నప్పటికీ ధైర్యం కోల్పోలేదు. అమెరికా మీద గెలవటం అన్నది కల అని తెలిసినప్పటికీ ప్రతిఘటన దాడులు జరుపుతున్నది. ముందుగా దాడులు నిలిపివేయాలని, తమకు నష్టపరిహారం చెల్లించాలని, తమపై ఉన్న ఆంక్షలను ఎత్తివేయాలని, భవిష్యత్‌లో ఎలాంటి దాడులు జరపబోమనే హామీ కావాలని అమెరికాకే షరతులు పెట్టింది. తాను బలహీనంగా ఉన్నపుడు ఎదుటి వాడి బలహీనతల మీద దెబ్బకొట్టాలన్నది ఒక సూత్రం. ఇప్పుడు అదే జరిగింది. హోర్ముజ్ జలసంధిని దిగ్బంధనం చేయటంతో ఆ మార్గంలో చమురు, గ్యాస్ ఎగుమ తి, దిగుమతి చేసుకొన దేశాలు ప్రభావితమై అమెరికా మీద వత్తిడి తెస్తాయన్నది ఒకటైతే అమెరికా మిలిటరీ స్థావరాలను అనుమతించిన గల్ఫ్ దేశాల మీద దాడులు చేస్తే అవి కూడా వాషింగ్టన్ మీద ప్రభావం చూపుతాయన్నది ఇరాన్ అంచనా, అదే జరిగింది. నిజానికి ఈ విషయాలన్నీ ముందే చెప్పినా ఎవరూ ఖాతరు చేయలేదు. చేతులు కాలిన తరువాత ఆకులు పట్టుకున్నట్లు ఇప్పుడు కతార్, ఒమన్ తెర వెనుక కాల్పుల విరమణ యత్నాలు ప్రారంభించాయి. అయితే తొందరేం లేదు ముందు మాపై దాడులను నిలిపివేయనివ్వండి. అర్ధవంతమైన ప్రతిపాదనలతో రానివ్వండి అన్నట్లు ఇరాన్ తాపీగా ఉంది. ఎలాంటి చర్చలకూ సంసిద్ధత వెల్లడించలేదు. యుద్ధం మీద అమెరికా అదుపు కోల్పోతున్నదంటూ సోమవారం నాడు అమెరికా ప్రధాన మీడియాలో తీవ్ర ఆందోళన వ్యక్తమైంది. ఉభయపక్షాలూ ఎవరూ ఎవరిని నమ్మే స్థితి లేనందున చర్చలు అనుమానమే. ఒకవేళ తామే విజయం సాధించినట్లు అమెరికా ప్రకటిస్తే హోర్ముజ్ జలసంధి మీద ఇరాన్ ఆధిపత్యం నిర్ధారణ అవుతుంది. దాని అణు కార్యక్రమం కూడా కొనసాగుతుంది. రానున్న రోజుల్లో మరిన్ని దాడులు జరిపితే గల్ఫ్ దేశాల మీద ఇరాన్ దాడులు కొనసాగుతాయి. ఇరాన్ చమురు కేంద్రం ఖార్గ్ దీవి మీద దాడులకు దిగితే పరిస్థితి మరింతగా దిగజారుతుంది. మెరైన్ దళాలతో ఈ దీవిని చేరుకుంటే పెద్ద సంఖ్యలో అమెరికన్లను బందీలుగా ఇరాన్‌కు అప్పగించటమే అని రాజీనామా చేసిన ఉన్నతాధికారి కెంట్ హెచ్చరించాడు. అందువలన ఏకపక్షంగా దాడులను విరమించటమే అమెరికా ముందున్న మార్గం అని చెప్పవచ్చు. అయితే సామ్రాజ్యవాదం తన ఓటమిని అంత తేలికగా అంగీకరిస్తుందా? ఒకవైపు ఐదు రోజుల విరామం ప్రకటించిన ట్రంప్ మరోవైపు అదనపు దళాలను సమీకరిస్తున్నాడు. జపాన్‌లో ఉన్న సైనిక స్థావరం నుంచి రెండువేల మంది మెరైన్ (సముద్రం, భూమి మీదా దాడులు చేసే శిక్షణ పొందినవారు) దళాన్ని మధ్య ప్రాచ్యానికి తరలించారు. అమెరికాలోని కాలిఫోర్నియా నుంచి మరో రెండున్నర వేల మందిని తరలిస్తున్నారు. ఏప్రిల్ నాటికి ఇతర మరికొన్ని దళాలను కూడా తరలించేందుకు నిర్ణయించారు. అమెరికా దూకుడు వైఖరిలో వచ్చిన మార్పుతో ఊహాగానాలు ఊపందుకున్నాయి. పాకిస్తాన్ కేంద్రంగా వాషింగ్టన్–టెహ్రాన్ చర్చలు ఈ వారంలో జరగవచ్చని రాయిటర్స్ పేర్కొన్నది. ఉభయ పక్షాలను దగ్గరకు చేర్చేందుకు ఈజిప్టు, టర్కీ తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నాయి. పాక్ సైన్యాధికారి మునీర్ రెండు దేశాల అధ్యక్షులతో ఈపాటికే సంప్రదింపులు జరిపినట్లు వార్తలు. ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ గాలీబ్‌తో ట్రంప్ అల్లుడు కుషనర్, రాయబారి స్టీవ్ విట్‌కాఫ్ సంప్రదింపులు జరిపినట్లు ఇజ్రాయిల్ మీడియా పేర్కొన్నది. ట్రంప్ చర్యలకు నిరసనగా రాజీనామా చేసిన అమెరికా ఉగ్రవాద వ్యతిరేక సంస్థ మాజీ అధిపతి జో కెంట్ ఐదు రోజుల ట్రంప్ విరామ ప్రకటన గురించి స్పందించాడు. ముందుగా ఇజ్రాయిల్‌ను అదుపు చేస్తే తప్ప సంప్రదింపులు ముందుకు వెళ్లవని, అవి కొనసాగితే అమెరికా సంప్రదింపుల సామర్థ్యం బలహీనపడుతుందని చెప్పాడు. ఇజ్రాయిల్ గూఢచార సంస్థలు ఇచ్చిన తప్పుడు సమాచారం అమెరికాను యుద్ధంలోకి లాగిందని, అమెరికా విదేశాంగ విధానంపై ప్రభావం చూపిందన్నది కెంట్ అభిప్రాయం. యావత్ ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచిన ఇరాన్ మరొక చర్య ఏమంటే గల్ఫ్ దేశాల్లో ఉన్న డేటా (సమాచార) కేంద్రాలపై దాడులు. ఈ కేంద్రాలు అమెరికా, ఇజ్రాయిల్ చేపట్టిన కృత్రిమ మేథ లక్ష్యాలను నెరవేర్చకుండా చేసేందుకు ఇరాన్ కేంద్రీకరించింది. అయితే అమెరికా కూడా టెహ్రాన్‌లో ఉన్న కేంద్రాల మీద దాడులు చేసింది. ఇప్పటి వరకు రెండు వైపులా ఐదు కేంద్రాలు దెబ్బతిన్నట్లు చెబుతున్నారు. ఇరవై తొమ్మిది సాంకేతిక కేంద్రాలపై దాడులు చేస్తామని ఇరాన్ ప్రకటించింది. సాంప్రదాయ యుద్ధంలో వంతెనలు, విమానాశ్రయాలు, నౌకా కేంద్రాల మీద కేంద్రీకరించటం తెలిసిందే. ఇప్పుడు యుద్ధంలో డేటా కేంద్రాలను కూడా వినియోగిస్తున్నందున వాటిని కూడా వదలటం లేదు. గల్ఫ్ దేశాలు వివాదాలకు దూరంగా ఉంటాయంటూ అమెరికా, ఇతర అనేక దేశాలు అక్కడ పెట్టుబడులు పెట్టాయి. తాజా పరిణామాలతో అవి ఆర్థికంగా నష్టపోవటమేగాక గల్ఫ్ దేశాల మీద ఉన్న నమ్మకం కూడా సడలటం ఖాయం. రష్యాను దెబ్బ తీసేందుకు ఈ దేశాలు ఉక్రెయిన్‌కు డేటా కేంద్రాల ద్వారా కీలకమైన రష్యా కేంద్రాల గురించి సమాచారం ఇవ్వటమేగాక ఉక్రెయిన్ దాడులను సమన్వయపరచటం, ఎప్పటికప్పుడు మాప్‌లను అందించటం వంటి సేవలను అందించాయి.

# యూరియాపై పశ్చిమాసియా ప్రభావం

రానున్న ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి యూరియా నిల్వలు తగినంతగా ఉన్నాయని, వ్యవసాయానికి ఎలాంటి ఆటంకం ఏర్పడదని కేంద్ర ప్రభుత్వం చెబుతున్నప్పటికీ పరిస్థితులు అనూహ్యంగా ఉంటున్నాయి. మార్చి 10 నాటికి భారత్‌లో యూరియా నిల్వలు 61.5 లక్షల మెట్రిక్ టన్నుల వరకు ఉన్నాయని, అంటే గత ఏడాది ఇదే సమయంలో ఉండే నిల్వల కన్నా 10 లక్షల టన్నుల వరకు అధికంగా ఉన్నాయని ప్రభుత్వం చెబుతోంది. పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధం ప్రపంచ వాణిజ్యాన్ని అల్లకల్లోలం చేస్తోం ది. ఈ సంక్షోభం వ్యవసాయానికి ప్రధాన అవసరమైన యూరియా తయారీకి కావలసిన లిక్విఫైడ్ నేచరల్ గ్యాస్ (ద్రవీకృత సహజవాయువుఎల్ఎన్‌జి) సరఫరాపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. యుద్ధం ప్రకంపనలు ఇప్పటికే భారత్ యూరియా సరఫరాను దెబ్బతీస్తున్నాయి. ఆదివారం (మార్చి 22) నాటికి భారత్ లోని యూరియా ప్లాంట్లు సగం సామర్థ్యంతో నడుస్తున్న పరిస్థితి ఏర్పడింది. కొన్ని యూరియా కంపెనీలు ప్లాంట్లను మూసివేసే పరిస్థితులు ఏర్పడ్డాయి. భారత్ అతిపెద్ద ఎల్ఎన్‌జి దిగుమతిదారైన పెట్రోనెట్ ఎల్ఎన్‌జి సంస్థ ఖతార్ నుండి దీర్ఘకాలిక ఒప్పందాల ద్వారా గ్యాస్ సరఫరాను నిర్వహించడం పరిపాటిగా వస్తోంది. ఇటీవల ఖతార్‌లోని రాస్‌లాఫాన్‌లో యుద్ధంవల్ల గ్యాస్ సరఫరా వ్యవస్థకు నష్టం జరగడంతో ఒప్పందం ప్రకారం సరఫరా చేయలేనని పెట్రోనెట్ చేతులుఎత్తేసింది. ఈ చర్య కేంద్ర ప్రభుత్వ యాజమాన్యం లోని గెయిల్ (ఇండియా), ఇండియా ఆయిల్ కార్పొరేషన్ సంస్థ, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ వంటి గ్యాస్ పంపిణీదారుల ద్వారా సరఫరా కోతకు దారి తీసింది. ఎల్ఎన్‌జి సరఫరా కోసం భారత్ భారీగా దిగుమతులపైనే ఆధారపడుతోంది. భారత్ రోజూ 4.7 మిలియన్ బ్యారెళ్ల ముడి చమురును, అంటే తన అవసరాల్లో 88%, అలాగే 47% సహజవాయు డిమాండ్ కోసం ద్రవీకృత సహజవాయువును విదేశాలనుంచి దిగుమతి చేసుకుంటోంది. దీనివల్ల ప్రపంచ మార్కెట్‌లో యూరియా ధరలు పెరగడమే కాకుండా ఎరువులపై భారత ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలపై కూడా ప్రభావంపడే అవకాశం కనిపిస్తోంది. యూరియా కొరతవల్ల వ్యవసాయ ఉత్పాదక ఖర్చులు పెరగడమే కాకుండా ద్రవ్యోల్బణం పెరిగే అవకాశం ఉంది. 2025లో అంతర్జాతీయ మార్కెట్ నుంచి 50% పైగా సహజవాయువు (ఎల్ఎన్‌జి)ను భారత్ దిగుమతి చేసుకుంది. ప్రపంచం మొత్తంమీద భారీస్థాయిలో ఎల్ఎన్‌జి నాలుగో కొనుగోలుదారు భారత్‌యే. 2025లో 261 లక్షల మెట్రిక్ టన్నుల ఎల్ఎన్‌జిని భారత్ దిగుమతి చేసుకుంది. ఇందులో 40% ఖతార్ నుంచి మిగతా 20% యుఎఇ, ఒమన్ ద్వారా సరఫరా అవుతుంది. ఈ ఎల్ఎన్‌జి అంతా హోర్ముజ్ జలసంధి ద్వారానే నౌకల మీదుగా రవాణా అవుతుంది. మొత్తం మీద భారత్ దిగుమతి చేసుకునే ఎల్ఎన్‌జి 60% వరకు హోర్ముజ్ జలసంధి మూసివేయడంవల్ల అంతరాయం ఏర్పడుతోంది. భారత్‌లో అమోనియా తయారీకి తద్వారా ఎరువుల తయారీకి ప్రధానంగా సహజవాయువునే వినియోగిస్తుంటారు. 2026లో భారత్‌కు సరఫరా అయిన ఎల్ఎన్‌జిలో 30% ఎరువుల తయారీకే వినియోగం కావడం గమనార్హం. యూరియా ఉత్పత్తికి ఎల్ఎన్‌జి ప్రధాన వనరు. దేశంలో ఎరువులుగా యూరియానే ఎక్కువగా వాడుతుంటారు. యూరియా ఉత్పత్తి అత్యంత ఇంధన వినియోగతో కూడిన ప్రక్రియ. ఈ యూరియా ప్లాంట్లు తక్కువ ఉద్గారాలను విడుదల చేసే సహజవాయువు వినియోగంలోకి మారాయి. జాతీయ స్థాయిలో యూరియా వినియోగం గత దశాబ్దకాలంలో క్రమంగా పెరిగి 2025లో 387 లక్షల మెట్రిక్ టన్నులకు పెరిగింది. 2025లో స్వదేశీ యూరియా ఉత్పత్తి కూడా దాదాపు 306 లక్షల మెట్రిక్ టన్నుల వరకు జరిగినా దేశం మొత్తం మీద డిమాండ్‌ను నెరవేర్చలేకపోతోంది. అందువల్ల భారత్ యూరియా దిగుమతులపై ఆధారపడవలసి వస్తోంది. ఈ నేపథ్యంలో పశ్చిమాసియాలో యుద్ధ బీభత్సం స్వదేశీ యూరియా ఉత్పత్తిని, సరఫరాను దెబ్బతీస్తోంది. 2025లో భారత్ యూరియా దిగుమతులు 2300 లక్షల మెట్రిక్ టన్నుల వరకు ఉన్నాయి. ఈ దిగుమతుల్లో 71% పశ్చిమాసియా నుంచి రావలసి ఉండగా, ఇందులో 45% ఒమన్, సౌదీఅరేబియా, ఖతార్, యుఎఇ నుంచి సరఫరా అవుతుంటాయి. ఈ మొత్తం సరఫరా హోర్ముజ్ జలసంధిద్వారా రవాణా కావలసి ఉంది. ఈ నేపథ్యంలో సహజవాయువు సరఫరా నియంత్రణ ఉత్తర్వు 2026ను భారత ప్రభుత్వం జారీ చేసింది. ఇందులో ఎరువుల రంగాన్ని ప్రాధాన్యత జాబితాలో చేర్చింది. రెండు మూడేళ్ల క్రితం ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం ప్రారంభించినప్పుడు కూడా ఇంధనం, ఎరువుల సరఫరా విషయంలో కూడా భారత్ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవలసి వచ్చింది. ఎరువుల తయారీకి ప్రాధాన్యం ఇచ్చి స్వదేశీయంగా సబ్సిడీ ధరకు గ్యాస్ లభిస్తేనే ఎరువులు ఉత్పత్తి అవుతాయి. రష్యా, ఉక్రెయిన్ యుద్ధం వల్ల కూడా పొటాష్ సరఫరా దెబ్బతింది. ప్రపంచ దేశాలకు సరఫరా అయ్యే యూరియాలో 14% ఒక్క రష్యా నుంచే సరఫరా అవుతోంది. డిఎపిలో రష్యా సరఫరా దాదాపు 10% వాటాతో రెండో ఉత్పత్తిదారుగా రష్యా ఉంటోం ది. పొటాష్‌లో కావలసినవి 50% రష్యా, బెలారస్ నుంచే రప్పించుకోక తప్పదు. భారత్ డిఎపి డిమాండ్‌లో దాదాపు 60% చైనా, సౌదీఅరేబియా నుంచే లభిస్తోంది. ఇప్పుడు సౌదీఅరేబియా కూడా యుద్ధ బాధిత దేశంగా ఉండడంతో డిఎపి సరఫరా దెబ్బతింటోంది. భారతదేశానికి సరఫరాలో ఇబ్బందులే కాకుండా దిగుమతుల వ్యయం బిల్లుకూడా అమాంతంగా పెరిగే ప్రమాదం ఏర్పడే పరిస్థితి ఉందని వాణిజ్యవర్గాలు ఆందోళన చెందుతున్నాయి.

# పురాణ పురుషుడు శ్రీరామచంద్రుడు

భారతావని ప్రసవించిన మహాపురుషులలో అవతార పురుష డు శ్రీరామచంద్రుడు అత్యంత ప్రాచీన చారిత్రక పురుష నాయకుడు. శ్రీరామచంద్రుని చారిత్రక పురుష నిగా పాశ్చాత్య పరిశోధకులు కూడా నిర్ధారించారు. భారతీయ కాలమాన ప్రకారం రాముడు జన్మించినది వైవస్వత మన్వంతరమున పంచమ త్రేతాయుగ నాలుగవ భాగమున ఎనభై వేల సంవత్సరానికి సరియగు విళంబి సంవత్సర చైత్ర శుద్ధ నవమి బుధవారం అని శ్రీమాన్ కోయిల్ కందాడై వెంకట సుందరాచార్య స్వామి వచించారు. పురాణాల ఆధారంగా మహాభారత యుద్ధం నాటికి శ్రీరాముడు అతి ప్రాచీనుడు. మను చక్రవర్తి వంశావళిలో రాముడు 65వ పురుషుడని, ఆయన వంశస్తుడు శ్రీకృష్ణునికి సమకాలికుడైన బృహద్బలుడు మను వంశమున 94వ వాడని సుప్రసిద్ధ పాశ్చాత్య చారిత్రిక పరిశోధకుడు పరిటేరు నిర్ణయించాడు. వాల్మీకి రామాయణమును అనుసరించి రాముని జననకాలం క్రీ.పూ. 2055వ సంవత్సరంగా ఎల్.డి.స్వామికన్ను పిళ్ళై నిర్ధారించగా, ఎం.ఆర్. సంపత్కు మార సమర్ధించారు. పాశ్చాత్య చరిత్రకారులైన డబ్ల్యు.డబ్ల్యు.హంటర్, కానింగ్ ఆర్నాల్డ్ వంటి వారు, రామాయణ చరిత్ర క్రీ.పూ.1000 సంవత్సరాల ప్రాంత మని పేర్కొన్నారు. ప్రాచీన రుగ్వేద మంత్రమున (+.93.14) శ్రీరామ పవిత్ర నామం స్మరించ బడింది. మహా విష్ణువు ఎత్తిన 10 అవతారాలలో ఏడవది రామావ తారం. శ్రీరాముడు కోసలాధీశుడైన దశరథునికి, కౌసల్య గర్భమున చైత్ర శుద్ధ నవమి పునర్వసు 4వ పాదమున కర్కాటక లగ్నంలో మధ్యాహ్న సమయాన జన్మించాడు. అందుకే చైత్ర శుద్ధ నవమి శ్రీరామ జయంతి దినమైంది. ఇది వసంత నవరాత్రులకు చివరిదినం. రాముడు పుట్టి నది నవమికాగా, అంతకు ముందు అనగా రాముడు గర్భంలో ఉన్న చివరి తొమ్మిది దినాలు చేసే మత విధులు, పూజాదికాలు గర్భ నవరాత్రులుగా ఆరాధ నీయం, ఆచరణీయంగా ఉన్నాయి. ఆగస్త్య సంహితలో అష్టమి గురుపూజ, నవమి ప్రతిమా కల్పన, దశమి ప్రతిమా దానంగా మూడునాళ్ళ పండగగా చెప్పబడింది. నవమి ఉపవాసం, రాత్రి పురాణ శ్రవణం, జాగరణ, మరు నాడు సంతర్పణ చేయాలని ఉంది. పునర్వసు నక్షత్ర యుక్త నవమి పుణ్యకాలమని భావిస్తారు. అష్టమితో కూడిన నవమిని రామపూజ కూడదని విష్ణుభక్తులకు అగస్త్య సంహిత సూచిస్తున్నది. అందుకే మిగులు నవమి నాడు వైష్ణవులు రామ జయంతిని జరపడం పాటిస్తారు. శ్రీరామ నవమి నాటి కార్యకలాపాలు మధ్యాహ్నం 12గంటలకు చేయాలని వ్రత గ్రంథాలు సూచిస్తున్నాయి. రామ జననం, కల్యాణం జరిపే రామ నవమి కాకుండా రామ సంబంధ పండగలలో ఒకటి రామలక్ష్మణ ద్వాదశిగా జరుపుకునే జ్యేష్ఠ శుద్ధ ద్వాదశి, రెండవది జానకీ జయం తిగా జరుపుకునే ఫాల్గుణ శుద్ధ అష్టమి. జనకునికి యజ్ఞ శాలకై భూమిని దున్నతుండగా నాగటి చాలుకు తగిలిన బంగారు పెట్టెలో భూజాత దొరికినది ఫాల్గుణ శుక్ల అష్ట మిగా భావిస్తారు. శ్రీకృష్ణునిలా కాక, రాముని జన్మదినో త్సవం కన్నా కళ్యాణోత్సవానికి విశిష్టత ఉంది. రామ జన్మకు కారణమైన రావణవధ ద్వారా లోకకళ్యాణం. సీతాదే వితో కూడిన రాముని వల్లే లోక కళ్యాణం సాధ్యమైంది. రాముని ఆంధ్రుల దౌహిత్రునిగా భావిస్తారు. కోసలాదేశ రాజు కూతురు కౌసల్య. దక్షిణ కోసల అంటే పూర్వాంధ్ర దేశ ఉత్తర భాగం. కౌసల్య ఆంధ్రుల ఆడపడచు అనీ, వన వాసాన్ని రాముడు తల్లి పుట్టింటి దేశపుటడవులలో గడిపా రని వాదం ఉంది. వనవాస రాఘవునికి ఆతిథ్యమిచ్చిన తెలుగు నేలపై ఆయన జన్మదినమైన శ్రీరామనవమి, కళ్యాణ దినంగా ఘనంగా జరుపుకోవడం సనాతన సాంప్రదాయంగా వస్తున్నది. శ్రీరాముని జన్మసమయం గురించి పరిశోధన చేసేందుకు పుష్కర్ భట్నాగర్, అమెరికా నుంచి 'ప్లానెటోరియం' అనే సాఫ్ట్‌వేర్‌ను కొనుగోలు చేసి, ఈ సాఫ్ట్‌వేర్ సాయంతో ఏ రోజున గ్రహగతులు ఎలా ఉన్నాయో తెలుసుకునే ప్రయత్నం చేశారు. శ్రీరాముడు పుట్టిన సమయంలో గ్రహాల స్థితి వాల్మీకి బాలకాండలో వర్ణించారు. ఈ సమాచారాన్నంతా సాఫ్ట్‌వేర్ సాయంతో క్రోడీకరించిన పుష్కర్ భట్నాగర్‌కు సదరు జన్మ సంవత్సరం తేలింది. చాంద్రమానం ప్రకారం ఆ రోజు చైత్రశుద్ధ నవమి అని తేలడంతో, ఆయన వాదనకు బలం చేకూరి, రామాయణంలో ఉట్టంకించిన గ్రహస్థితులను బట్టి... రాములవారు అరణ్యావాసం చేసిన సమయం (5089 బి.సి), హనుమంతుడు సీతను లంకలో కలుసుకున్న సంవత్సరం (5076 బి.సి) తదితర కాలాలను కూడా నిర్ణయించామన్నారు భట్నాగర్.పురాణాలను, జ్యోతిష్యాన్ని, ఖగోళ శాస్త్రాలను అనుసంధానపరుస్తూ, కొందరు పరిశోధన చేసి, శ్రీరాముడు పుట్టింది క్రీ.పూ 5114 సంవత్సరం, జనవరి 10 మధ్యాహ్నం 12:05 గంటలు అని తేల్చారు. ఏది ఏమైనా, వాస్తవాలు ఏవైనా, శ్రీరామ చంద్రుడు చారిత్రక పురుషునిగా భావించబడుతూ, పితృవాక్య ఆచరణాసక్తునిగా, ఆదర్శ చక్రవర్తిగా, రామరాజ్య స్థాపకునిగా, ప్రజారంజక పాలకునిగా, ఈనాటికీ పూజింప బడుతుండడం, ఆ మహాపురుషుని నవరాత్రులు, జన్మ, కళ్యాణోత్సవాలు, ఈ నాటికీ నిర్వహించబడుతుండడం విశేషం.

# నేటి తరానికి ఆదర్శం ధర్మబిక్షం

ఆయన స్వాతంత్ర్య సమరయోధులు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధులు. నిజాం వ్యతిరేక ఉద్యమ కారులు. నిబద్దత కలిగిన రాజకీయ నాయకులు. ప్రముఖ కమ్యూనిస్టు నాయకులు మూడు సార్లు ఎమ్మెల్యేగా, రెండు సార్లు ఎంపీగా ప్రజా మద్దతుతో ఎన్నికై, అత్యంత సామాన్య జీవితం గడిపిన అసామాన్య నాయకులు. ఆయనే బొమ్మగాని ధర్మబిక్షం. బొమ్మగాని ధర్మబిక్షం యువకుడిగా విద్యార్థి నాయకులు, ప్రముఖ కమ్యూనిస్టు నాయకులు, కార్మిక సంఘాల నాయకులు, తెలంగాణ సాయుధ పోరాట యోధులు. ఆర్య సమాజ్ బాధ్యులు. ప్రజా జీవితమే పరమావధిగా ఆజన్మ బ్రహ్మచారిగా గడిపిన ఆదర్శ నాయకులు. సామా జిక సేవకునిగా, గ్రామీణ పేదల హక్కుల కోసం పోరాటం, యువత, విద్యార్థులు అసంఘటిత కార్మికుల సంఘటితం, పేదలకోసం భూమి, ఇళ్ళు కొనుగోలు లాంటి కార్యక్రమా లలో అకుంఠిత కార్యదీక్ష, అంకిత భావంతో నిరంతరం అవిశ్రాంతంగా కృషి చేశారు. ఆయన నల్లగొండ జిల్లాలోని మునుగోడు మండలం, ఊకొండి గ్రామంలో బొమ్మగాని ముత్తి లింగయ్య గౌడ్, పద్మ దంపతులకు 1922 ఫిబ్రవరి 15లో జన్మించారు. బొమ్మ గాని ధర్మబిక్షం తండ్రి చిన్నవయస్సులో సూర్యాపేటకు వచ్చి స్థిరపడ్డారు. ధర్మభిక్షం సూర్యాపేటలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మెట్రిక్యులేషన్ పూర్తి చేశారు. విద్యార్థి దశలోనే జాతీయ భావాలు అలవరుచు కున్నారు. నిజాం పట్టాభిషేక రజతోత్సవాల సందర్భంగా పాఠశాలలో ఉత్స వాలు జరపాలన్న ప్రధానోపాధ్యా యుడి ఆదేశాలను వ్యతిరేకించి తోటి విద్యార్థులతో కలిసి బహిష్క రించారు. సామాజిక రుగ్మతలపై పోరాడటం కోసం తన సహ విద్యార్థులకు శిక్షణనివ్వటానికి విరాళాలు సేకరించి ఒక వసతి గృహం ఏర్పాటు చేశారు. సోవియట్ సోషలిస్ట్ విప్లవం, భారత దేశంలో జరిగిన అనేక సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలు నల్గొండ జిల్లాలో మొదటి కమ్యూనిస్ట్ సెల్‌ను స్థాపించడానికి ధర్మభిక్షంను ప్రేరేపించాయి. అలా 1942లో సీపీఐలో చేరి,కమ్యూనిస్టు పార్టీ తో అనుబంధాన్ని ఏర్పరచు కుని, ధర్మభిక్షం పార్టీలో పనిచేస్తూనే పాత్రికేయులుగా తెలంగాణలోని నాటి ప్రముఖ పత్రికలైన మీజాన్, రయ్యత్, గోల్కొండల్లో పనిచేశారు.




నిజాంపై సాయుధ పోరాటం మొదలైన తర్వాత తుపాకి చేత బట్టి యుద్ధరంగంలోకి దిగారు. సాయుధ పోరాటాన్ని విస్తరింప జేశారు. దేశ్‌ముఖ్ వ్యతిరేక పోరాటంలో భాగంగా పేరుమోసిన భూస్వామి విస్నూరు రామచంద్రా రెడ్డికి వ్యతిరేకంగా ధర్మభిక్షం విద్యా సంస్థల్లో నిరవధిక సమ్మెను నిర్వహించి,ఏడాదిన్నర పాటు అజ్ఞాత జీవితం గడిపారు. తర్వాత అరెస్టు కాబడి ఐదేళ్లకు పైగా జైలుశిక్షను అనుభవించారు. సూర్యా పేటలో, చంచల్ గూడ సెంట్రల్ జైలు, ఔరంగాబాద్, జాల్నా జైళ్లలో గడిపారు. స్వాతంత్ర్యం అనంతరం 1952లో తొలిసారిగా హైదరాబాద్ రాష్ట్ర శాసనసభకు సూర్యాపేట నియోజక వర్గం నుండి అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆంధ్ర ప్రదేశ్ శాసనసభకు 1957లో నకిరేకల్ నుండి, 1962లో నల్గొండ నుండి ప్రాతినిధ్యం వహించారు. 1991లో, 1996లోనూ ఆయన ఎంపీగా నల్గొండ లోకసభ నియోజక వర్గం నుండి విజయం సాధించి పార్లమెంట్‌లో అడుగు పెట్టారు. 1996 లో 11వ లోక్‌సభ ఎన్నికలలో నల్లగొండ నుండి 480 మంది ఫ్లోరైడ్ బాధితులు పోటీ చేసినప్పటికి ఆయన 76 వేల ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. గీత పనివారల సంఘం ఏర్పాటు చేసి గౌడ కులస్తుల హక్కుల కోసం ఆయన చివరి వరకు పోరాడారు.తెలంగాణ ప్రాంతంలో శ్రమ జీవులను సమైక్య పర్చడంలో, పలు కార్మిక సంఘాల స్థాపనలో ధర్మబిక్షం పాత్ర మారవ లేనిది. పలు కార్మిక సంఘాల స్థాపనలో ధర్మబిక్షం ప్రధాన పాత్ర వహించి 'కార్మిక పక్షపాతి'గా గుర్తింపు తెచ్చు కున్నారు. ధర్మభిక్షం తెలుగు, ఉర్దూ, ఇంగ్లీషు, హిందీ భాషల్లో మంచి వక్తగా పేరు తెచ్చుకున్నారు. 1951–73లో భారత కమ్యూనిస్ట్ పార్టీ (సిపిఐ) జిల్లా మండలి, నల్గొండ కార్యదర్శిగా, 1952–57, 1957–62, 1962–67 ఆంధ్రప్రదేశ్ శాసనసభ శాసన సభ్యులుగా, 1972 నుండి ఆంధ్రప్రదేశ్ సిపిఐ, కార్యవర్గ సభ్యులుగా, 1991లో 10వ లోక్ సభ సభ్యులుగా, 1991–96 సంప్రదింపుల కమిటీ, గ్రామీణాభివృద్ధి శాఖ సభ్యులుగా. 1992–95 ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి, సిపిఐ, కార్యవర్గ సభ్యులుగా, 1996 లో 11వ లోక్ సభ సభ్యులుగా, భారత కమ్యూనిస్ట్ పార్టీ (సిపిఐ), జాతీయ మండలి సభ్యులుగా పనిచేసిన విశేష అనుభవం గడించారు. నిజాం హయాంలో రైతాంగ ఉద్యమంలో పాల్గొని, భారత ప్రభుత్వం నుంచి తామ్రపత్ర పురస్కారం అందుకున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపూర్ లో 2019 నవంబర్ 8న రోజున బొమ్మగాని ధర్మభిక్షం విగ్రహాన్ని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆవిష్కరించారు. ధర్మబిక్షం నీతి, నిజాయితీకి ఆదర్శనీ యుడని ఆయన జీవిత చరిత్రను పాఠ్యాం శంలో చేర్చాలని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆ సందర్భం గా అభిప్రాయం వ్యక్తం చేయడం గమనార్హం. జీవితాంతం ప్రజా సేవకే అంకితమై, సోదరుని కుమారున్ని దత్తత తీసుకుని, అవివాహితులుగానే ఉన్నారు. 89 ఏళ్ళ వయసులో ఇంట్లో జారి పడటంతో ఆయన తుంటి ఎముకకు దెబ్బ తగలగా, హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసు పత్రిలో ఫిబ్రవరి 11న శస్త్రచికిత్స జరిపించుకొని, తర్వాత ఊపిరి తిత్తుల సమస్యతో చికిత్స పొందుతూ 2011, మార్చి 26న మరణించారు. పోరాట యోధుని గా, అసామాన్య ప్రజా సేవకునిగా ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానాన్ని పొందారు.

# అరటిపండ్లు లేదా ఖర్జూరా.. మార్నింగ్ తినేందుకు ఏది బెస్ట్!

మార్నింగ్ మనం తినే ఆహారం అనేది మన దే మొత్తంపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుంది. కాబట్టి మనం మార్నింగ్ తినే ఆహారంపై ప్రత్యేక శ్రద్ధ చూపడం చాలా అవసరం. ఈ మధ్య కాలంలో చాలా మంది మార్నింగ్ లేచిన వెంటనే టీ, కాఫీ వంటివి తీసుకోవడం మనం గమనించవచ్చు. కానీ నిపుణులు మాత్రం ఆరోగ్యానికి అనుకూలంగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలని సూచిస్తున్నారు. ఈ క్రమంలో అరటి పండు, ఖర్జూరం రెండూ ఆరోగ్యానికి అనేక విధాలుగా మేలు చేస్తాయని చెబుతున్నారు. సరైన ఆహారంతో మన దేను ప్రారంభించడం వల్ల మన జీర్ణక్రియ మెరుగుపడుతుంది. శక్తి స్థాయిలు పెరుగుతాయి. ఇది మన మొత్తం ఆరోగ్యంపై సానుకూల ప్రభావాన్ని చూపుతుంది. ముఖ్యం మార్నింగ్ పండ్లను తినడం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. అయితే ప్రతి పండు ప్రత్యేకమైనదే.. వీటిని ఖాళీ కడుపుతో తిన్నప్పుడు ఒక్కొటి ఒక్కొరకమైన ప్రయోజనాలను అందిస్తాయి. సాధారణంగా జనాలు ఎక్కువగా తీసుకునే అరటి పండు, లేదా ఖర్జూరా పండ్ల విషయానికి వస్తే ఈ రెండు కూడా వేర్వేరు పోషక ప్రొఫైల్‌లను అందిస్తాయి. కాబట్టి ఏ పండు వల్ల ఎలాంటి ప్రయోజనాలు ఉన్నాయి, మార్నింగ్ తినేందుకు రెండింటిలో ఏద ఉత్తమమైనదో చూద్దాం.

అరటిపండ్లలో పొటాషియం, మెగ్నీషియం, సహజ చక్కెరలు పుష్కలంగా ఉంటాయి. ఇది తక్షణ శక్తిని అందిస్తుంది. అయితే, ఖాళీ కడుపుతో అరటిపండ్లు తినడం ప్రయోజనకరంగా ఉండకపోవచ్చు. దీనిలో పొటాషియం పుష్కలంగా ఉండటం వల్ల అవి గుండె, కండరాల పనితీరుకు ప్రయోజనకరంగా ఉంటాయి, ఇది చాలా మందికి సులభంగా జీర్ణం అవుతుంది. అయితే దీన్ని తినడం వల్ల కూడా కొన్ని దుష్ప్రభావాలు ఉంటాయి. ఇది శరీంలోని మెగ్నీషియం సమతుల్యతను దెబ్బతీయ వచ్చు.అలాగే సహజ చక్కెరలు శక్తిలో అకస్మాత్తుగా పెరుగుదలకు కారణమవుతాయి, ఆ తర్వాత అకస్మాత్తుగా తగ్గుతాయి. సున్నితమైన వ్యక్తులలో, ఇది





ఆమ్లత్వం లేదా ఉబ్బరాన్ని కలిగిస్తుంది. కాబట్టి ఇది అందరికి ఒకే రకమైన ప్రయోజనాలను అందించలేదు.

ఖర్జూరాలు ఖాళీ కడుపుతో తినడానికి అత్యంత ప్రయోజనకరమైన పండ్లలో ఒకటిగా పరిగణించబడతాయి, ముఖ్యంగా సాంప్రదాయ, ఆయుర్వేద పద్ధతులలో వీటిని తినడం వల్ల తక్షణ శక్తి లభిస్తుంది. వీటిలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది, ఇది జీర్ణక్రియకు సహాయపడుతుంది, అలాగే మలబద్ధకాన్ని నివారిస్తుంది. అలాగే ఆమ్లత ప్రమాదాన్ని తగ్గిస్తాయి. ఖర్జూరాలు పేగు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి, జీవక్రియను పెంచుతాయి. వాటిలో ఇనుము, యాంటీఆక్సిడెంట్లు కూడా ఉంటాయి, ఇవి ఉదయం అలసట లేదా శక్తి లేకపోవడం అనుభవించే వారికి ప్రత్యేకంగా ప్రయోజనకరంగా ఉంటాయి. నిపుణుల అభిప్రాయం ప్రకారం, 2-3 ఖర్జూర పండ్లను రాత్రిపూట నీటిలో నానబెట్టి ఉదయం తినడం వల్ల జీర్ణక్రియ బాగా జరిగి పోషకాలు గ్రహించబడతాయి. చాలా మందికి, ఖాళీ కడుపుతో ఖర్జూరాలు తినడం ఆరోగ్యకరమైన ఎంపిక కావచ్చు. ఎందుకంటే అవి జీర్ణక్రియకు సహాయపడతాయి అలాగే దీర్ఘకాలిక శక్తిని అందిస్తాయి. అరటిపండ్లు పోషకమైనవి, కానీ జీర్ణ సమస్యలను నివారించడానికి వాటిని తరువాత లేదా ఇతర ఆహారాలతో కలిపి తినడం మంచిది. అయితే, మధుమేహ వ్యాధిగ్రస్తులు తాము తీసుకునే పండ్లు, కూరగాయల పరిమాణాన్ని పర్యవేక్షించాలి. ఆమ్లత్వం లేదా ఉబ్బరం ఉన్నవారు అరటిపండ్ల కంటే ఖర్జూరం జీర్ణం కావడానికి సులభం అని భావిస్తారు. అరటిపండ్లు, ఖర్జూరాలు రెండూ ఆరోగ్యకరమైన పండ్లు, కానీ వాటిని తీసుకునే సమయం వేటితో కలిపి తింటున్నామనేది ముఖ్యం. ఖర్జూరాలు సాధారణంగా ఖాళీ కడుపుతో తింటే పోషకమైనవి, కానీ ఉదయం అరటిపండ్లను ఇతర ఆహారలో పార్టు తీసుకోవడం ఉత్తమం.

# ఈ గింజలు వదలకుండా తినేయండి..!



జాక్ ఫ్రూట్ గింజలు ఫైబర్ తో సమృద్ధిగా ఉంటాయి. ఇవి జీర్ణవ్యవస్థకు చాలా ప్రయోజనకరంగా ఉంటాయి. వీటిని తినడం వల్ల మీరు ఎక్కువసేపు కడుపు నిండిన అనుభూతిని కలిగి ఉంటారు. అతిగా తినకుండా ఉండటానికి సహాయపడుతుంది. పనస గింజల్లో ఇనుము పుష్కలంగా ఉంటుంది. ఇది మన శరీరంలో హిమోగ్లోబిన్ ఉత్పత్తిని ప్రోత్సహించడంలో సహాయపడుతుంది. ఇది ఎర్ర రక్త కణాల ఏర్పాటుకు కూడా సహాయపడుతుంది. దీన్ని మీ ఆహారంలో చేర్చుకోవడం వల్ల రక్తహీనతను నివారించవచ్చు. పనస గింజలలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది కాబట్టి, తరచుగా మలబద్ధకంతో బాధపడేవారు వీటిని తినాలి. అలాగే, జీర్ణ సమస్యలు ఉన్న వారికి కూడా పనస గింజలు ఎంతో మంచిదని చెబుతున్నారు. పనస గింజలను పొడి చేసుకుని తీసుకుంటే జీర్ణ సమస్యలు ముఖ్యంగా గ్యాస్, మలబద్ధకం, ఎసిడిటీ వంటి సమస్యలు దూరం అవుతాయని సూచిస్తున్నారు. అలాగే, విటమిన్ ఎ పనస గింజల్లో పుష్కలంగా లభ్యమవుతుంది. విటమిన్ ఎ కంటి ఆరోగ్యానికి ముఖ్యమైన పోషకాలలో ఒకటన్న సంగతి తెలిసిందే. కాబట్టి, పనస గింజలను ఉడకబెట్టి లేదా వేరే విధంగా కూడా తీసుకోవచ్చు. దాంతో కంటి ఆరోగ్యం పెరుగుపడుతుంది. అదేవిధంగా పనస గింజల్లో కాల్షియం, పొటాషియం, మెగ్నీషియం, జింక్ వంటి పోషకాలు కూడా పుష్కలంగా లభిస్తాయి. ఇవి ఎముకులను, దంతాలను దృఢంగా మారుస్తాయి. గుండె పోటు, ఇతర గుండె జబ్బులు రాకుండా రక్షిస్తాయి. జాక్‌ఫ్రూట్ గింజలు తినడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. మీరు పనస గింజలను వేయించి తినవచ్చు. వాటిని ఒక పాన్ మీద 15-20 నిమిషాలు వేయించాలి. అవి కొద్దిగా గోధుమ రంగులోకి మారిన తర్వాత, వాటిపై కొంచెం నల్ల ఉప్పు, చాట్ మసాలా చల్లి తినండి. పనస గింజలను ఎండలో ఎండబెట్టి పొడి చేసి, సలాడ్లు లేదా పండ్లపై చల్లి తినవచ్చు. మీకు ఇష్టమైన పండ్లతో పాటు పనస గింజల సహాయంతో మీరు స్మూతీలను కూడా తయారు చేసుకోవచ్చు.

# రోజంతా గోరువెచ్చని నీరు తాగితే ఏమవుతుంది?



మన శరీరంలో 70 శాతం నీరే ఉంటుంది. అయితే ఆధునిక జీవనశైలిలో మనం రకరకాల డ్రింక్స్‌కు అలవాటు పడి, ప్రకృతి ప్రసాదించిన స్వచ్ఛమైన నీటిని ఎలా తాగాలో మర్చిపోతున్నాం. ముఖ్యంగా ఉదయాన్నే నిద్రలేవగానే గోరువెచ్చని నీరు తాగడం వల్ల శరీరానికి ప్రయోజనాలు ఉన్నాయా..?ఇది అందరికీ మంచిదేనా? నీరు శరీర దాహాన్ని తీర్చడమే కాకుండా రక్తంలో కలిసిపోయి ప్రతి కణానికి ఆక్సిజన్‌ను సరఫరా చేసే జీవనాధారం. మానవ శరీరం 70 శాతం నీటితోనే నిర్మితమై ఉంటుంది. అయితే ఏ రకమైన నీరు ఎప్పుడు తాగాలి అనే విషయంలో చాలామందికి స్పష్టత ఉండదు. మన పూర్వీకుల నుండి వస్తున్న ఉదయం గోరువెచ్చని నీరు తాగే అలవాటు కేవలం సంప్రదాయం మాత్రమే కాదు అదొక అద్భుతమైన ఆరోగ్య ప్రక్రియ అని ఆయుర్వేదం చెబుతోంది.ఆయుర్వేద శాస్త్రం ప్రకారం.. ఉదయాన్నే గోరువెచ్చని నీరు తాగడం వల్ల శరీరంలోని జీర్ణ అగ్ని యాక్టివేట్ అవుతుంది. ఇది శరీరంలోని కఫ దోషాన్ని సమతుల్యం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుంది.జీర్ణక్రియ మెరుగు: తిన్న ఆహారం త్వరగా జీర్ణం కావడానికి, మలబద్ధకం సమస్యను వదిలించడానికి ఇది చక్కటి పరిష్కారం.టాక్సిన్స్ తొలగింపు: శరీరం లోపల పేరుకుపోయిన హానికరమైన విష పదార్థాలను బయటకు పంపి, రక్తాన్ని శుద్ధి చేస్తుంది.బరువు తగ్గడం: క్రమం తప్పకుండా వేడి నీటిని తాగడం వల్ల శరీరంలో మెటబాలిజం రేటు పెరిగి, కొవ్వు కరగడానికి సహాయపడుతుంది.శ్వాసకోశ సమస్యలకు చెక్: గొంతులో పేరుకుపోయిన కఫాన్ని వదులు చేసి, దగ్గు, జలుబు నుండి ఉపశమనాన్ని ఇస్తుంది.ఉదయం ఖాళీ కడుపుతో: బాడీని రీఛార్జ్ చేయడానికి, జీర్ణక్రియను వేగవంతం చేయడానికి ఇది బెస్ట్ టైమ్.భోజనానికి 30 నిమిషాల ముందు: ఇది ఆకలిని నియంత్రించి, బరువు తగ్గాలనుకునే వారికి ఉపయోగపడుతుంది.భోజనం చేసిన గంట తర్వాత: తిన్న ఆహారం మెత్తగా మారి, పోషకాలు ఒంటికి పట్టడానికి ఇది సహాయపడుతుంది.గోరువెచ్చని నీరు ఆరోగ్యానికి మంచిదే అయినా, ఈ కింది సందర్భాల్లో తాగడం ప్రమాదకరమని ఆయుర్వేదం హెచ్చరిస్తోంది..తీవ్రమైన వేసవిలో: ఎండలు ఎక్కువగా ఉన్నప్పుడు వేడి నీరు తాగడం వల్ల శరీరంలో ఉష్ణోగ్రత పెరిగి అసౌకర్యం కలుగుతుంది.పిత్త సమస్యలు ఉన్నప్పుడు: కడుపులో మంట లేదా అసిడిటీతో బాధపడేవారు వేడి నీటికి దూరంగా ఉండాలి. అధిక దాహం: విపరీతమైన డీహైడ్రేషన్ ఉన్నప్పుడు గోరువెచ్చని నీరు తాగితే శరీరంలోని తేమ మరింత తగ్గే అవకాశం ఉంది.


# రోగాలను నయం చేసే శక్తి దీనికి ఉంది!



అతిబల మొక్క, భారతీయ సంప్రదాయ వైద్యంలో శతాబ్దాలుగా ఉపయోగించబడుతోంది. ఇది యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలతో జ్వరం, దగ్గు, కీళ్లనొప్పులు, కిడ్నీలో రాళ్లు, మూత్రనాళ వ్యాధులు, నడుము నొప్పి వంటి 100కు పైగా రోగాలను నయం చేయగలదని ఆయుర్వేదం చెబుతుంది. మన చుట్టూ ఉండే ఎన్నో మొక్కలు అలివికాని మొండి రోగాలను సైతం నయం చేయగలవని చాలామందికి తెలియదు. అలాంటి అద్భుత ఔషధ గుణాలు కలిగిన మొక్కల్లో అతిబల ఒకటి. దీనిని దువ్వెన బెండ, ముద్ర బెండ, తుత్తురు బెండ అని కూడా పిలుస్తారు. ఈ మొక్క మాల్వేసి కుటుంబానికి చెందినది. రోడ్ల పక్కన, పొలాల కంచెల వెంట విస్తారంగా కనిపించే ఈ మొక్కలో దాగి ఉన్న అద్భుత ఔషధ గుణాలు చాలామందికి తెలియదు. అతిబల మొక్క యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్ఫ్లమేటరీ ధర్మాలను కలిగి ఉంటుంది. భారతీయ సంప్రదాయ వైద్యంలో, ముఖ్యంగా తమిళ సిద్ధ వైద్యంలో, భారతీయ ఆయుర్వేదంలో దీనిలోని ప్రతి భాగాన్ని వివిధ వ్యాధుల చికిత్సకు ఉపయోగిస్తారు. ఈ మొక్క జ్వరం, దగ్గు, ఊపిరితిత్తుల వ్యాధులు, మూత్రనాళ వ్యాధులు, కిడ్నీలో రాళ్లు కరిగించడానికి చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. కీళ్లనొప్పి లేదా కీళ్లవాతం ఉన్నప్పుడు అతిబల ఆకుల పేస్ట్‌కు ఆవాల నూనె కలిపి రాయడం వల్ల ఉపశమనం లభిస్తుంది. రక్త మొలలు ఉన్నవారు ఆకులను ఉడికించి తింటే తగ్గుతాయని చెబుతారు. ఆడవారిలో యోని ఇన్ఫెక్షన్లు ఉంటే, దీని ఆకుల డికాక్షన్‌తో శుభ్రం చేసుకోవచ్చు. చర్మంపై వాపులు, గాయాలు, పుండ్లు ఉన్నప్పుడు అతిబల ఆకులను పసుపుతో కలిపి పేస్ట్‌గా చేసి రాయడం వల్ల త్వరగా నయం అవుతాయి, ఎందుకంటే ఆకులకు యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ఉన్నాయి. మూత్రంలో మంట, మూత్రాశయంలో రాళ్లు ఉన్నవారు అతిబల ఆకులను నీటిలో మరిగించి తేనె కలిపి త్రాగడం వల్ల రాళ్లు కరిగి, మంట తగ్గుతుంది. అతిసారం ఉన్నవారికి దీని విత్తనాల పొడితో చేసిన టీ ఔషధంలా పనిచేస్తుంది. కంటిచూపు మెరుగుపరచడానికి అతిబల ఆకుల డికాక్షన్‌తో కళ్ళు కడుక్కుంటే మంచిది. ఊపిరితిత్తుల వ్యాధులు, క్షయ, శ్వాసనాళ వాపులకు దీని మొత్తం మొక్క భాగాన్ని (పూలు, కాండం, ఆకులు, కాయలు, వేర్లు) ఉపయోగించి కషాయం కాచి తాగడం వల్ల ఉపశమనం లభిస్తుంది. జ్వరం తగ్గడానికి అతిబల ఆకులను నానబెట్టి, ఆ నీటికి పటికబెల్లం కలిపి త్రాగుతారు. దంతాల ఆరోగ్యం కోసం దీని ఆకుల రసాన్ని నోటిలో ఉంచుకొని ఊసేయడం, డికాక్షన్‌తో పుక్కిలించడం వల్ల దంతాలు గట్టిపడి పంటినొప్పి తగ్గుతుంది. నడుము నొప్పి తగ్గడానికి అతిబల ఆకుల కషాయం త్రాగాలి. గౌట్, క్షయ, నోటిపూత, పేగుపూత, రక్తస్రావాలకు కూడా దీని డికాక్షన్ ఉపయోగిస్తారు. శరీరానికి బలం రావాలంటే, అతిబల మొక్క వేరును ఆవుపాలతో మరిగించి పటికబెల్లం కలిపి తీసుకోవాలని ఆయుర్వేద గ్రంథాలు సూచిస్తున్నాయి. మూత్రంలో రక్తం పడటం, మూత్రనాళంలో మంట తగ్గడానికి దీని ఆకుల రసాన్ని తేనెతో కలిపి తీసుకుంటారు. అతిబల ఆకుల రసాన్ని చక్కెరతో కలిపి త్రాగితే గుండె ఆరోగ్యానికి మంచిది. మగవారిలో శీఘ్రస్కలనం సమస్యకు, యూరినరీ ఇన్ఫెక్షన్లకు దీని వేరు కషాయం ఔషధంగా పనిచేస్తుంది. అతిబల మొక్క రక్తంలో చక్కెర శాతాన్ని తగ్గించి షుగర్ వ్యాధిగ్రస్తులకు మేలు చేస్తుంది. ఈ మొక్క ఆకులు రోగనిరోధక శక్తిని పెంచి అనేక వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తాయి.

# పేరంట్స్ కోసం...15 శాతం జీతాలు

# రేవంత్ సంచలన నిర్ణయం




**హైదరాబాద్ :** కన్నవారిని కంటికి రెప్పలా చూసుకోవాల్సిన బాధ్యతను మరిచి, వారిని రోడ్డున పడేస్తున్న కొందరు ప్రభుత్వ ఉద్యోగుల తీరుపై తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ఒక సంచలనం అని చెప్పాలి. పదవి, హోదా ఉన్నా.. కన్నతల్లిదండ్రులకు పట్టెడు అన్నం పెట్టని వారికి ఈ కొత్త చట్టం ఒక గట్టి గుణపాఠం కానుంది. మమకారం కరువైన చోట కనీసం ఆర్థిక భరోసానైనా కల్పించాలన్న ప్రభుత్వ సంకల్పం వేలాది మంది వృద్ధులకు కొండంత అండగా నిలవబోతోంది. ఈ చట్టం వెనుక ఉన్న నిబంధనలు, అది అమలులోకి వచ్చే తీరుపై లోటుగా విశ్లేషణ చేస్తే.. తల్లిదండ్రుల కోసం జీతంలో కోత తమ తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే ప్రభుత్వ ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమైంది. సదరు ఉద్యోగి జీతంలో 15 శాతం లేదా గరిష్టంగా ?10,000 వరకు కోత విధించి, ఆ మొత్తాన్ని నేరుగా వారి తల్లిదండ్రుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేయాలని నిర్ణయించింది. దీనివల్ల వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులు తమ పిల్లల దయాదాక్షిణ్యాలపై ఆధారపడకుండా, గౌరవంగా బతికే అవకాశం లభిస్తుంది. కేవలం హెచ్చరికలకే పరిమితం కాకుండా, నేరుగా ఆర్థికపరమైన చర్యలు తీసుకోవడం ఇదే మొదటిసారి. ఈ వినూత్న నిర్ణయానికి చట్టబద్ధత కల్పించేందుకు ప్రభుత్వం 'తెలంగాణ ఎంప్లాయీస్ అకౌంటబిలిటీ అండ్ మానిటరింగ్ ఆఫ్ పేరెంటల్ సపోర్ట్' అనే కొత్త చట్టాన్ని తీసుకురాబోతోంది. ఈ బిల్లుపై ఈరోజు జరిగే కేబినెట్ సమావేశంలో చర్చించి ఆమోదం తెలపనున్నారు. అనంతరం ఒకటి రెండు రోజుల్లోనే దీనిని అసెంబ్లీలో ప్రవేశపెట్టి చట్టంగా మలిచే అవకాశముంది. ఒకసారి ఈ చట్టం అమల్లోకి వస్తే, తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదు అందిన వెంటనే విచారణ జరిపి, ఆటోమేటిక్‌గా జీతం నుంచి కోత విధించే ప్రక్రియ ప్రారంభమవుతుంది. నైతిక బాధ్యత చాలా మంది ఉద్యోగులు తమ సొంత ఇల్లు, పిల్లల చదువుల పేరుతో తల్లిదండ్రులను దూరం పెడుతున్నట్లు అనేక ఫిర్యాదులు అందుతున్నాయి. ప్రభుత్వ ఉద్యోగం అంటే కేవలం విధులే కాదు, నైతిక బాధ్యతలు కూడా ఉంటాయని ఈ చట్టం గుర్తు చేస్తోంది. ప్రభుత్వం కేవలం జీతాలు ఇవ్వడమే కాకుండా, ఆ జీతంతో కుటుంబంలోని వృద్ధులకు న్యాయం జరుగుతోందా లేదా అన్నది కూడా పర్యవేక్షించనుంది. ఇది సమాజంలో వృద్ధాశ్రమాలకు వెళ్లే వారి సంఖ్యను గణనీయంగా తగ్గించే అవకాశం ఉంది. ఈ చట్టం కేవలం శిక్షాత్మక చర్యలకే పరిమితం కాకుండా, సమాజంలో ఒక లోతైన మార్పును తీసుకురావాలనే లక్ష్యంతో రూపొందించబడింది. కేవలం ఆర్థిక పరమైన అంశాలనే కాకుండా, వృద్ధాప్యంలో తల్లిదండ్రులు ఎదుర్కొనే సామాజిక వివక్షను అరికట్టడం కూడా ఈ బిల్లులోని అంతర్లీన ఉద్దేశ్యం. ప్రభుత్వ ఉద్యోగులు సమాజంలో ఒక బాధ్యతాయుతమైన వర్గంగా ఉంటారు కాబట్టి, వారి నుంచే ఈ ప్రక్షాళన మొదలవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ చట్టం అమలులోకి వస్తే, అది కేవలం ఒక నిబంధనగా కాకుండా, ప్రతి ఇంట్లోనూ కన్నవారి పట్ల ఉండాల్సిన కనీస ధర్మాన్ని గుర్తుచేసే ఒక నైతిక భారంగా మారుతుంది. ఈ చట్టానికి సంబంధించిన మరిన్ని కీలక అంశాలు ఇక్కడ ఉన్నాయి: వృద్ధాశ్రమాలకు చెక్ - కుటుంబ వ్యవస్థకు బలం! ప్రస్తుత కాలంలో వృద్ధాశ్రమాల సంఖ్య పెరిగిపోవడానికి ప్రధాన కారణం.. ఆర్థికంగా స్థిరపడిన పిల్లలు తమ తల్లిదండ్రులను భారంగా భావించడమే. ముఖ్యంగా స్థిరమైన ఆదాయం ఉండే ప్రభుత్వ ఉద్యోగులే తమ వారిని దూరం పెట్టడం అత్యంత విచారకరం. ఈ కొత్త చట్టం ద్వారా, తల్లిదండ్రుల పోషణకు అవసరమైన కనీస మొత్తాన్ని వారి జీతం నుంచే నేరుగా అందించడం వల్ల, వృద్ధులు అనాథాశ్రమాలకు వెళ్లాల్సిన అవసరం తప్పుతుంది. ఇది మన భారతీయ ఉమ్మడి కుటుంబ వ్యవస్థను మళ్లీ బలోపేతం చేయడానికి మరియు వృద్ధులకు ఆత్మగౌరవంతో కూడిన జీవితాన్ని ప్రసాదించడానికి ఒక గొప్ప మార్గంగా నిలుస్తుంది. ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక యంత్రాంగం! ఈ చట్టం అమలులో భాగంగా, కేవలం నిబంధనలు పెట్టడమే కాకుండా, తల్లిదండ్రుల ఫిర్యాదులను స్వీకరించడానికి ప్రభుత్వం ఒక ప్రత్యేక విభాగాన్ని లేదా కమిటీని ఏర్పాటు చేయాలని యోచిస్తోంది. ఒకవేళ ఏ ప్రభుత్వ ఉద్యోగి అయినా తన తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తున్నట్లు ఆధారాలతో సహా ఫిర్యాదు అందితే, తక్షణమే విచారణ జరిపి చర్యలు తీసుకునేలా నిబంధనలు రూపొందిస్తున్నారు. ఇది ప్రభుత్వ యంత్రాంగంలో ఒక జవాబుదారీతనాన్ని పెంచడమే కాకుండా, తల్లిదండ్రుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే వారికి సింహస్వప్నంలా మారుతుంది. తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న ఈ నిర్ణయం ఇతర రాష్ట్రాలకు కూడా ఆదర్శంగా నిలవనుంది. భయంతోనైనా తల్లిదండ్రులను చూసుకోవడం మొదలుపెడితే, క్రమంగా వారి మధ్య ఉన్న దూరం తగ్గే అవకాశం ఉందని సామాజికవేత్తలు భావిస్తున్నారు. కన్నవారి రుణం తీర్చుకోలేకపోయినా, కనీసం వారికి ఆకలి బాధ లేకుండా చూడటం ప్రతి బిడ్డ కనీస ధర్మం. ఈ చట్టం ద్వారా ప్రభుత్వం వృద్ధుల కళ్లలో వెలుగు నింపాలని చూస్తోంది.

# ఐటీ సిటీకి గండం...



**హైదరాబాద్ :** సిలికాన్ వ్యాలీ ఆఫ్ ఇండియాగా వెలుగొందుతున్న భాగ్యనగర ఐటీ కోటకు బీటలు వారుతున్నాయా? దశాబ్ద కాలంగా లక్షలాది మందికి ఉపాధి కల్పించి, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచిన ఐటీ రంగం.. ఇప్పుడు మొదటిసారిగా తిరోగమనం వైపు అడుగులు వేస్తోందా? కేవలం గణాంకాల తగ్గుదల మాత్రమే కాదు.. ఏఐ విసిరిన సవాలు.. అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితి హైదరాబాద్ ఐటీ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్నాయి. రాజకీయ విమర్శల వెనుక దాగి ఉన్న అసలు చేదు నిజం ఏమిటి? ఇది కేవలం ఒక తాత్కాలిక మందగమనమా లేక పెను సంక్షోభానికి సంకేతమా? అన్నది చర్చనీయాంశమైంది. హైదరాబాద్ ఐటీ రంగంలో చోటుచేసుకుంటున్న పరిణామాలు ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశంగా మారాయి. గడిచిన దశాబ్ద కాలంగా అప్రతిహత వృద్ధితో దూసుకుపోయిన ఈ రంగంలో మొదటిసారిగా 'రివర్స్ ట్రెండ్' కనిపిస్తుండటం అటు నిరుద్యోగులను, ఇటు ఆర్థిక నిపుణులను కలవరపెడుతోంది. గణాంకాలు చెబుతున్న చేదు నిజం తెలంగాణ మాజీ ఐటీ మంత్రి కేటీఆర్ చేసిన ఒక ట్వీట్ ఇప్పుడు రాజకీయ సెగలను మించి ఐటీ వర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. 2023లో 9.46 లక్షలుగా ఉన్న ఐటీ ఉద్యోగుల సంఖ్య, 2026 నాటికి 9.39 లక్షలకు పడిపోయిందని ప్రభుత్వం స్వయంగా గణాంకాల్లో వెల్లడించడం గమనార్హం. అంటే మూడేళ్ల కాలంలో సుమారు 7,000 ఉద్యోగాల తగ్గుదల నమోదైంది. సాధారణంగా ఏటా లక్షల్లో కొత్త ఉద్యోగాలు రావాల్సిన చోట.. ఉన్నవి తగ్గిపోవడం ఐటీ హబ్‌గా హైదరాబాద్ ప్రతిష్టకు సవాలుగా మారింది. ఈ తిరోగమనానికి కేవలం స్థానిక పరిస్థితులే కాకుండా అంతర్జాతీయ పరిణామాలు ప్రధాన కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు. గతంలో వేలాది మంది అవసరమయ్యే కోడింగ్, టెస్టింగ్ , సపోర్ట్ పనులను ఇప్పుడు ఏఐ సెకన్లలో చేస్తోంది. ఆటోమేషన్ వల్ల కంపెనీలు 'లీన్ మేనేజ్‌మెంట్' తక్కువ మందితో ఎక్కువ పని వైపు మొగ్గు చూపుతున్నాయి. ప్రపంచ ఆర్థిక అనిశ్చితి: అమెరికా, యూరప్ దేశాల్లో ఆర్థిక మాంద్యం భయాలు, వడ్డీ రేట్ల పెరుగుదల వల్ల ఐటీ ప్రాజెక్టుల బడ్జెట్‌లో కోతలు పడ్డాయి. మన ఐటీ రంగం ప్రధానంగా విదేశీ క్లయింట్లపై ఆధారపడటం వల్ల ఈ ప్రభావం నేరుగా ఇక్కడ కనిపిస్తోంది. పాత పద్ధతుల్లో సాగే సాఫ్ట్‌వేర్ మెయింటెనెన్స్ పనులు తగ్గిపోతున్నాయి. కంపెనీలు కేవలం హై-లెవల్ నైపుణ్యం ఉన్నవారిని మాత్రమే తీసుకుంటున్నాయి, దీనివల్ల కొత్తవారికి అవకాశాలు దెబ్బతింటున్నాయి. ఆర్థిక వ్యవస్థపై పడనున్న 'చైన్ ఎఫెక్ట్' ఐటీ రంగం కేవలం కంప్యూటర్లకే పరిమితం కాదు. ఇది ఒక పెద్ద ఎకోసిస్టమ్. ఐటీ ఉద్యోగుల కొనుగోలు శక్తిపైనే హైదరాబాద్‌లోని రియల్ ఎస్టేట్, హోటల్ రంగం, రవాణా, రిటైల్ వ్యాపారాలు ఆధారపడి ఉన్నాయి. ఉద్యోగాల కోత లేదా వేతనాల స్తబ్దత కొనసాగితే గృహ రుణాలు వినియోగ వస్తువుల విక్రయాలు తగ్గి, నగరం యొక్క మొత్తం ఆర్థిక చక్రం మందగించే ప్రమాదం ఉంది. ముందున్న మార్గం: నైపుణ్యమే ఆయుధం రాజకీయ విమర్శలు ఎలా ఉన్నా ఐటీ రంగం ఇప్పుడు ఒక పరివర్తన దశలో ఉందన్నది కాదనలేని వాస్తవం. భవిష్యత్తులో కేవలం రొటీన్ పనులు చేసేవారికి చోటు ఉండదు. "పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నప్పటికీ ఇది ముగింపు కాదు. జెనరేటివ్ ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్ వంటి కొత్త టెక్నాలజీలలో ఉద్యోగులు త్వరగా నైపుణ్యం సాధించాల్సిన అవసరం ఉంది." అని నిపుణులు సూచిస్తున్నారు. ప్రభుత్వం కూడా కేవలం ఉన్న కంపెనీలను కాపాడుకోవడమే కాకుండా, కొత్త పెట్టుబడులను ఆకర్షించేలా 'స్కిల్లింగ్ సెంటర్స్' పై దృష్టి పెట్టాలి. ఈ హెచ్చరికను గమనించి అప్రమత్తం కాకపోతే హైదరాబాద్ సాధించిన ఐటీ కీర్తి మసకబారే ప్రమాదం ఉంది.

# భానుడి భగ భగలు



**జూలూరుపాడు :** వేసవి కాలం ముందే మొదలైంది మార్చి నెల ప్రథమార్ధం నుంచి ఇప్పటివరకు భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతూ ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఉష్ణోగ్రతల నమోదు మండలంలో గరిష్ట ఉష్ణోగ్రతలు ఇప్పటికి 32ఇ, నుండి 33 డిగ్రీలకు చేరుకుంది. కొన్ని ప్రాంతాల్లో సాధారణం కంటే 2-3 అ, అదనంగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఏప్రిల్ నెల లో కనిపించే ఎండ తీవ్రత ఈ ఏడాదిలో మార్చి నెలలో చూస్తున్నాం .ప్రస్తుతం ఎండలు మండుతున్నప్పటికీ రాబోయే కొన్ని రోజుల్లో రాష్ట్రానికి స్వల్ప ఉపశమనం లభించే అవకాశం ఉందని, అలాగే ఈ ఏడాది ఏప్రిల్ నెలలో ప్రభావం ఇంతకంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఏప్రిల్, మే నెలలో వడగాలులు ప్రభావం తీవ్రంగా ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. ఒకవైపు భానుడి సెగలు ఉన్నా కూడా రైతు సోదరులు మిర్చి తోటలలో పనులు నిర్వహిస్తున్నారు. కాలం రాకముందే ఉష్ణోగ్రత ఎక్కువ ఉండటం వలన బయటకు రాలేని పరిస్థితి. కానీ రైతు మాత్రం ఈ ఉష్ణోగ్రతను లెక్కచేయకుండా పండించిన పంటను పూర్తి న్యాయం చేస్తున్నారు. రైతుల పట్ల భానుడు కనీసం కనికరం చూపని పరిస్థితి. మండలంలో 24 గ్రామపంచాయతీలు, ప్రతి పంచాయతీ వ్యవసాయేతర రైతులు కలిగి ఉన్నారు. ఒకవైపు ఎండలు మండుతున్న లెక్కచేయకుండా పనులు నిర్వహించడం, అలాగే పనుల కంటే ప్రాణం విలువ ఎక్కువ కాబట్టి జూలూరుపాడు మండల పరిధిలో ఉన్న 24 గ్రామ పంచాయతీల రైతు సోదరులు అప్రమత్తంగా ఉండి, భానుడి సెగలనుండి బయటకు పడవలసిందిగా మండలంలో ఉన్న కొంతమంది భావిస్తున్నారు.

## గద్దర్ అవార్డ్సలో స్కాం...!

### రెండు కోట్లకు టెండర్... నాలుగు కోట్ల ఖర్చు...

**హైదరాబాద్ :** తెలంగాణ ప్రభుత్వం ఇటీవల ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన గద్దర్ అవార్డుల కార్యక్రమంలో కుంభకోణం జరిగిందా.. కోట్ల రూపాయలు దారి మళ్లాయా? ఇందులో ఇష్టారాజ్యంగా వ్యవహరించారా.. ముందుగా అనుకున్న దానికంటే.. ఎక్కువ ఖర్చు పెట్టారా.. ఇందులో ఎవరి పాత్ర ఎంత.. ఇప్పుడు ఇవే విషయాలను బయటపెట్టారు గులాబీ పార్టీ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్.గద్దర్ అవార్డుల పేరుతో తెలంగాణ ప్రభుత్వం అడ్డగోలుగా ఖర్చు చేసిందని శ్రవణ్ ఆరోపించారు. తెలంగాణ సంస్కృతిని గాలికి వదిలేసిందని మండిపడ్డారు. జ్యూరి సభ్యులను.. సినీ పెద్దలను అవమానించారని విమర్శించారు.. విచ్చలవిడిగా ఖర్చుపెట్టిన వ్యవహారంపై ప్రభుత్వం నోరు విప్పాలని.. ఎఫ్ డీ సీ చైర్మన్.. సంబంధిత మంత్రిపై చర్యలు తీసుకోవాలని శ్రవణ్ డిమాండ్ చేశారు. ఈనెల 19న హైటెక్స్ లో తెలంగాణ ప్రభుత్వం గద్దర్ ఫిలిం అవార్డులను అందజేత కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమ నిర్వహణ బాధ్యతను విజ్ క్రాఫ్ట్ అనే ముంబైకి చెందిన కంపెనీకి అప్పగించింది. అయితే అందులో ఉన్న లెక్కలకు సంబంధించిన ఓ కాపీ బయటికి వచ్చింది. దీనిని శ్రవణ్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. అవార్డుల ఫంక్షన్ లో శ్రేయ ఘోషల్ కు 1,65,00,000, దేవిశ్రీప్రసాద్ కు 60,00,000, దేవిశ్రీప్రసాద్ టెక్ రైడర్ కు 20,00,000, నిధి అగర్వాల్ కు 20,00,000, లివ బీనిఎవజీబిజీఎశ్రీవ (బజూవఇతిజీశ్రీ జీఇబి) 10,50,000, ఇశ్రీజీబబతిఇజీశ్రీ జీఇబి 6,50,000, వ్యాఖ్యాతలు సుమ, ప్రదీప్ కు 13 లక్షలు, కొరియోగ్రఫీ చేసిన వారికి 39,20,000, కాస్ట్యూమ్స్ కు ఐదు లక్షలు.. ప్రయాణానికి.. బస, భోజనాల ఖర్చుకు 60 లక్షలు.. రెడ్ కార్పెట్ యాంకర్లకు ఏడు లక్షలు.. హెయిర్.. మేకప్ వేసిన వారికి ఐదు లక్షలు.. మొత్తం ఆర్టిస్టుల ఖర్చు నాలుగు కోట్ల 11 లక్షల 20,000 బిల్లు అయింది.. వేదిక.. లైటింగ్.. ఇతర ఖర్చులకు భారీగా వెచ్చించారని శ్రవణ్ ఆరోపించారు. ఇక ఇదే డాక్యుమెంట్లో టెండర్ కాస్ట్ కాలంలో రెండు కోట్ల 13 లక్షలని ఉందని.. అయితే అసలు బిల్లు మాత్రం నాలుగు కోట్ల 11 లక్షల ఇరవై వేలని.. అనుకున్న దానికంటే రెండు కోట్లు అదనంగా ఖర్చు పెట్టారని శ్రవణ్ ఆరోపించారు. ఈ అదనపు ఖర్చును ఎఫ్డిసి చైర్మన్ లేదా సినిమాటోగ్రఫీ మంత్రి భరిస్తారా అని శ్రవణ్ ప్రశ్నించారు. విజ్ క్రాఫ్ట్ సంస్థకు కాంట్రాక్టు ఇచ్చిన వ్యక్తులు ఎవరని.. తెలంగాణ ప్రాంతంలో ఎటువంటి ఏజెన్సీలు లేవా.. దీనికి ఏమైనా ఓపెన్ టెండర్లు పిలిచారా.. లేదా ప్రభుత్వం తమకు కావలసిన వారికి కట్టబెట్టిందా అని.. శ్రవణ్ ప్రశ్నించారు. తెలంగాణలో రిటైర్డ్ ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు అలానే ఉండిపోయాయని.. కానీ ఒకరోజు ధూంధాం వేడుకకు నాలుగు కోట్లు ఖర్చు చేయాల్సిన అవసరం ఏమి వచ్చిందని శ్రవణ్ ప్రశ్నించారు.

## జమ్మికుంటలో జెపీఎల్ సీజన్-3 ప్రారంభం

### యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలి

**జమ్మికుంట :** జమ్మికుంట డిగ్రీ కళాశాల మైదానంలో జమ్మికుంట ప్రీమియం లీగ్ (జెపీఎల్) సీజన్-3 క్రికెట్ టోర్నమెంట్‌ను మున్సిపల్ ఛైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు, క్రీడాకారులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాట్లాడిన ఛైర్మన్ ప్రశాంత్ కుమార్ యువత క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, జట్టు భావనను పెంచుతాయని తెలిపారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ఏదో ఒక క్రీడలో నైపుణ్యం సాధించాలని, తల్లిదండ్రులకు గౌరవం ఇవ్వాలని సూచించారు. ఇలాంటి టోర్నమెంట్లు స్థానిక ప్రతిభను వెలికితీసేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని శుభాకాంక్షలు తెలిపారు. అన్ని జట్లు క్రీడాస్ఫూర్తితో పోటీ పడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ ముంతాజ్ అలీ జావేద్, కౌన్సిలర్ దిడ్డి కోమల, దిడ్డి రాము, మాచెర్ల రాజు, కందాల రాము, శ్రీనివాస్, రాము, క్రీడాభిమానులు, యువత పాల్గొన్నారు.

## అల్ఫోర్స్‌లో విపత్తు నిర్వహణ శిక్షణ శిబిరం

**కరీంనగర్:** తొమ్మిదవ తెలంగాణ బెటాలియన్ ఎన్‌సీసీ ఆధ్వర్యంలో కొత్తపల్లి అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాలలో నిర్వహించిన యువ ఆపద మిత్ర పథకం శిక్షణ శిబిరంలో భాగంగా విపత్తు నిర్వహణపై అవగాహన కార్యక్రమం జరిగింది. విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి, బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కర్నల్ ఏ.కే. జయంత పాల్గొని కెడెట్లను ఉద్దేశించి ప్రసంగించారు. విపత్తు నిర్వహణపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని, అప్రమత్తతతోనే ప్రాణనష్టం, ఆస్తినష్టం తగ్గించవచ్చని తెలిపారు. విపత్తులు ఎప్పుడు, ఎక్కడ సంభవించినా తక్షణ స్పందనతో సహాయక చర్యలు చేపట్టాలని, అవసరమైన వనరులను సమకూర్చి బాధితులకు అండగా నిలవాలని సూచించారు. ఈ అంశంపై అవగాహన కలిగిన వారు ఇతరులకు తెలియజేస్తూ సమాజంలో చైతన్యం తీసుకురావాలని పేర్కొన్నారు. కెడెట్లకు ప్రాయోగికంగా శిక్షణ ఇచ్చేందుకు అగ్నిమాపక సిబ్బంది విన్యాసాలు నిర్వహించారు. విపత్తు సమయంలో చేపట్టాల్సిన చర్యలను ప్రత్యక్షంగా చూపిస్తూ అవగాహన కల్పించారు. కెడెట్లు ప్రదర్శించిన కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. జిల్లా అగ్నిమాపక అధికారి రాజ్‌కుమార్, ఏఎస్ఐ మహేందర్, డీవీఆర్ ఆపరేటర్ లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు. చివరగా విపత్తు సమయంలో బాధ్యతగా వ్యవహరించాలని ప్రతిజ్ఞ చేయించారు.

## బీరంగూడలో హైడ్రా కమిషనర్ పర్యటన

**రంగారెడ్డి :** అమీన్పూర్ మండలం బీరంగూడ విలేజ్లోని సర్వే నంబరు 996, 997లో ఉన్న ఇండస్ట్రియల్ ఎంప్లాయీస్ కోపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీకి చెందిన లే ఔట్ను ఆక్రమించుకుని కొంతమంది 100 గజాల చొప్పున అమ్మేస్తున్నారని సొసైటీ ప్రతినిధులు చేసిన ఫిర్యాదును హైడ్రా కమిషనర్ బుధవారం పరిశీలించారు. 1982లో వేసిన లే ఔట్లో పలు సంస్థల్లో పని చేసిన ఉద్యోగులు ప్లాట్లు కొనగా.. ఇప్పుడవి అన్యాక్రాంతం అవుతున్నాయని వాపోయారు. 180 ఎకరాలలో దాదాపు 1650 ప్లాట్లతో లే ఔట్ వేసినట్టు రికార్డులు చూపించారు. లే ఔట్లలో పార్కులు, రహదారులను కాపాడాలని కోరారు. కొత్తగా ఆక్రమణలు రాకుండా చూడాలని హైడ్రా కమిషనర్ ఆదేశించారు. ఇక్కడ ప్రభుత్వ భూమి చుట్టూ ఫెన్సింగ్ వేయాలని సూచించారు. ఇప్పటికే యిల్లుకట్టుకుని, కొనుక్కొని ఉన్నవారు ఆందోళన చెందాల్సిన పని లేదని వారికి కమిషనర్ హామీ ఇచ్చారు. తరువాత అమీనపూర్ మండలం బీరంగూడ విలేజ్ లోని శంభుని కుంట అవుట్లెట్లను పరిశీలించారు. శంభుని కుంట వరద మా ప్రాంతాలను ముంచేస్తోందని అక్కడ నివాసితులు ఇచ్చిన ఫిర్యాదులను పరిశీలించారు. ఔట్లెట్ నాలాను మూసేసి నిర్మాణం జరుపుతున్న నిర్మాణ సంస్థపై చర్యలు తీసుకోవాలని సూచించారు. వరదకాలువలను పునరుద్ధరించి బాధ్యులపై కేసులు బుక్ చేయాలని అధికారులను ఆదేశించారు.

## శ్రీరాముడు ధర్మానికి ప్రతీక

## విలువలతో ముందుకు సాగాలి

**కరీంనగర్ :** శ్రీరామనవమి ముందస్తు వేడుకలు అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆధ్యాత్మిక వాతావరణంలో కార్యక్రమం ఆకట్టుకుంది. ప్రాంగణంలో ఏర్పాటు చేసిన శ్రీరాముని చిత్రపటానికి పూజలు నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలనతో వేడుకలను ప్రారంభించారు. కార్యక్రమానికి అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ వి. నరేందర్ రెడ్డి మాట్లాడారు. శ్రీరాముడు ధర్మానికి ప్రతీక అని అన్నారు. ప్రేమ, ఆప్యాయతలకు గొప్ప నిర్వచనమని చెప్పారు. రామాయణం అధ్యయనం ద్వారా విద్యార్థులకు మంచి విలువలు వస్తాయని సూచించారు. దేశవ్యాప్తంగా శ్రీరామనవమి వేడుకలు వైభవంగా జరుగుతాయని తెలిపారు. విదేశాల్లో కూడా ఈ పండుగను ఘనంగా నిర్వహించడం ఆనందకరమని అన్నారు.

## విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం

**హైదరాబాద్ :** విద్యే నిజమైన సాధికారతకు మార్గమని మహాత్మా జ్యోతిరావు పూలే గారు చెప్పిన మాటలను స్ఫూర్తిగా తీసుకుని తెలంగాణ విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. . సామాజిక సమానత్వం దిశగా అడుగులు వేస్తూ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మరియు ఓసీ విద్యార్థులు అందరూ ఒకే చోట అత్యాధునిక వసతులతో విద్యనభ్యసించేలా 105 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్' (జఎఖీ) పాఠశాలల నిర్మాణాన్ని వేగవంతం చేస్తున్నామని అన్నారు.. ప్రాథమిక విద్యను బలోపేతం చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా ప్రీ-ప్రైమరీ విభాగాలను విస్తరిస్తున్నాం.

## బిజినెస్

### ఫిలిప్స్ వన్ చెఫ్ విడుదల



భారతీయ గృహాలకు పాకశాస్త్ర అవకాశాల ప్రపంచాన్ని ఆవిష్కరిస్తూ, రోజువారీ వంటను సులభతరం చేయడానికి రూపొందించిన వినూత్నమైన ఆల్-ఇన్-వన్ స్మార్ట్ కుకింగ్ ఉపకరణం అయిన ఫిలిప్స్ వన్ చెఫ్ ను విడుదల చేస్తున్నట్టు ఫిలిప్స్ హోమ్ అప్లయన్సెస్ వెల్లడించింది. ముంబైలో, రణ్ వీర్ బ్రార్ పర్యవేక్షణలో జరిగిన ఒక అనుభవపూర్వకమైన చెఫ్స్ టేస్టింగ్ టేబుల్ కార్యక్రమంలో ఈ ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమంలో అతిథులను లైవ్ టేస్టింగ్స్, ఇంటరాక్టివ్ ఫుడ్ స్టేషన్ల ద్వారా భారతదే శంలోని విభిన్న వంట రుచులను అన్వేషించడానికి ఆహ్వానించారు. ఈసందర్భంగా గుల్బహర్ తౌరానీ మాట్లాడుతూ? వెర్సుని వద్ద భారతీయ కుటుంబాలు వాస్తవానికి ఎలా వంట చేస్తాయో అర్థం చేసుకోవడం, వారి రోజువారీ వంటలలో సహజంగా ఇమిడిపోయే ఉపకరణాలను రూపొందించడంపైనే తమ లక్ష్యం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. భారతీయ వంటకాలు చాలా వైవిధ్యమైనవి, తరచుగా ఎక్కువ సమయం తీసుకుంటాయన్నారు. అందుకే రుచిలో రాజీపడకుండా వంట ప్రక్రియలను సులభతరం చేసే పరిష్కారాలు రోజురోజుకూ ప్రాముఖ్యతను సంతరించుకుంటున్నా యన్నారు. భారతీయ వంటకాలు ఎంతో వైవిధ్యభరితంగా, విభిన్నంగా ఉంటాయన్నారు. రుచి పరంగా ఎలాంటి రాజీపడకుండా వాటిని మరింత సులభంగా అందుబాటులోకి తీసుకురావడంలో సాంకేతికత కీలక పాత్ర పోషించగలదన్నారు. ఆ సమతుల్యతను తీసుకురావడానికే వన్ చెఫ్ రూపొందించబడింది. ఇది ఇళ్లలో వంటి చేసే వారికి అనేక రకాల వంటకాలను మరింత సులభంగా, ఆత్మవిశ్వాసంతో అన్వేషించడంలో సహాయపడుతుందని చెఫ్ రణ్ వీర్ బ్రార్ అన్నారు.

### చమురు 150 డాలర్లకు చేరితే.. మాంద్యంలోకి ప్రపంచం..!



చమురు ధరలు 150 డాలర్లకు చేరితే ప్రపంచం ఆర్థిక మాంద్యంలోకి వెళుతుందని అమెరికా అసెట్ మేనేజ్‌మెంట్ దిగ్గజం బ్లాక్‌రాక్ సీఈవో లారీ ఫింక్ హెచ్చరించారు. ఇరాన్ ముప్పు కొనసాగి.. చమురు ధరలు పెరిగితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ తీవ్ర పర్యవసానాలు ఎదుర్కొంటుందని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ మేరకు అంతర్జాతీయ మీడియాకు ఇంటర్వ్యూ ఇచ్చారు. పశ్చిమాసియాలో ప్రస్తుత ఘర్షణలు చివరకు ఎలాంటి ఫలితాన్ని ఇస్తాయనే దానిపై ఇప్పుడే ఒక అంచనాకు రావడం తొందరపాటే అవుతుందని ఫింక్ అన్నారు. "ఘర్షణలు ముగిసి, ఎలాంటి ఆంక్షలు లేకుండా ఇరాన్ (ఎతీజీని)ను ప్రపంచం ఆమోదిస్తే.. చమురు ధరలు యుద్ధం ముందు నాటికంటే దిగువకు పడిపోతాయి. అలాకాకుండా వార్ కొనసాగి, ఆ ధరలు 100 డాలర్లకు పైగా.. 150 డాలర్లకు చేరువగా సుదీర్ఘకాలం ఉంటే.. ప్రపంచ ఆర్థికవ్యవస్థపై పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయి. ప్రపంచం ఆర్థిక మాంద్యంలోకి జారుకోవచ్చు" అని అంచనా వేశారు.

# దేశ జీడీపీ డౌన్!

## ఈసారి 5.9 శాతానికే పరిమితం

ఈ ఏడాదికిగాను దేశ జీడీపీ వృద్ధి అంచనాలను అమెరికా బహుళజాతి ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్, అంతర్జాతీయ ఆర్థిక సేవల దిగ్గజం గోల్డ్‌మన్ సాచ్స్ మరోసారి తగ్గించింది. అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధంతో పశ్చిమాసియా భగ్గుమంటున్న విషయం తెలిసిందే. గల్ఫ్ దేశాల్లో ముడి చమురు, ఎల్‌పీజీ, ఎల్ఎన్‌జీ ఉత్పత్తికి బ్రేకులుపడ్డాయి. భారత ఇంధన అవసరాల్లో దాదాపు 90 శాతం దిగుమతుల ద్వారానే తీరుతుండగా.. మిడిల్ ఈస్ట్ నుంచి పెద్ద ఎత్తునే వస్తున్నది. ఈ నేపథ్యంలో ఈసారి దేశ ఆర్థిక వృద్ధిరేటు 5.9 శాతాన్ని మించి ఉండబోదని గోల్డ్‌మన్ సాచ్స్ తాజాగా అభిప్రాయపడింది. 2026లో దేశ జీడీపీ వృద్ధి 7 శాతంగా ఉండొచ్చని గతంలో గోల్డ్‌మన్ సాచ్స్ అంచనా వేసింది. అయితే ఈ నెల 13న దీన్ని 6.5 శాతానికి తగ్గించింది. ఇప్పుడు 5.9 శాతానికి కుదించింది. కేవలం 11 రోజుల్లోనే అర శాతానికి (60 బేసిస్ పాయింట్లు) పైగా కోత పెట్టడం గమనార్హం. దీని వెనుక మిడిల్ ఈస్ట్ ఉద్రిక్తతలే కారణంగా ప్రధానంగా కనిపిస్తున్నాయి. గత నెల 28 నుంచి ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ వైమానిక దాడులను ప్రారంభించాయి. అప్పట్నుంచి గల్ఫ్ దేశాల్లో ఉద్రిక్తత వాతావరణం ఏర్పడింది. అమెరికాకు మద్దతిస్తున్నారని పొరుగు దేశాలైన కువైట్, ఖతార్, యూఏఈ, సౌదీ అరేబియా, బహ్రెయిన్, ఇరాక్‌లపై ఇరాన్ దాడులు చేస్తున్నది. ఆయా దేశాల్లోని చమురు, గ్యాస్ క్షేత్రాలనే లక్ష్యంగా చేసుకుని క్షిపణులు, డ్రోన్లను ప్రయోగిస్తున్నది. దీంతో క్రూడాయిల్, సహజ వాయువు ఉత్పత్తి నిలిచిపోయింది. పైగా మిడిల్ ఈస్ట్ నుంచి భారత్, చైనా సహా ఇతర దేశాలకు జరిగే రవాణాలో కీలకమైన హార్ముజ్ జలసంధిని కూడా ఇరాన్ మూసేసింది. ఈ పరిణామం ఒక్కసారిగా గ్లోబల్ మార్కెట్‌లో ముడి చమురు, గ్యాస్ ధరల పెరుగుదలకు దారితీసింది. ఈ నేపథ్యంలో దేశీయ మార్కెట్‌లో ఆయా పెట్రో ఉత్పత్తుల ధరలూ పెరిగాయి. గ్యాస్ కొరత కూడా కనిపిస్తుండగా, దేశవ్యాప్తంగా




చాలా హోటళ్లు, ఇతర గ్యాస్ ఆధారిత వ్యాపారాలు, పరిశ్రమలు మూతబడుతున్నదీ చూస్తూనే ఉన్నాం. ఎరువుల తయారీ కుంటుబడి వ్యవసాయ రంగం సైతం ప్రభావితం అవుతుందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇక రవాణా రంగంపైనా భారం పడుతుండగా.. పెరిగిన పెట్రోల్, డీజిల్ రేట్లతో ఆయా వస్తూత్పత్తులన్నింటి ధరలూ ఎగబాకి ద్రవ్యోల్బణం విజృంభిస్తున్నది. ఇది మరింత ముదిరితే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) రాబోయే ద్రవ్య సమీక్షల్లో కఠిన ద్రవ్య విధానాన్ని అనుసరించే అవకాశాలు లేకపోలేదు. దీంతో వడ్డీరేట్లు పెరుగడం ఖాయమనే మెజారిటీ విశ్లేషకులు అంటున్నారు. అదే జరిగితే రుణ లభ్యత క్షీణించి అన్ని రంగాల్లో కార్యకలాపాలు మందగిస్తాయి. మొత్తంగా దేశ ఆర్థిక వ్యవస్థ ప్రభావితమవుతుందని గోల్డ్‌మన్ సాచ్స్ చెప్తున్నది.

### ఎసి ధరలకు పశ్చిమాసియా సెగ..!

పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధాల వల్ల ఎసి ధరలు పెరిగే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి. సరఫరా తగ్గడం, ముడి సరుకుల ధరలు పెరగడంతో వచ్చే కొద్ది రోజుల్లోనే వినియోగదారులపై భారం పడొచ్చని భావిస్తున్నారు. ప్రముఖ ఎసి ఉత్పత్తుల కంపెనీ బ్లూ స్టార్ నివాస, వాణిజ్య కూలింగ్ విభాగాలలో తన ఉనికిని మరింత బలోపేతం చేసుకోనున్నట్లు మంగళవారం ప్రకటించింది. హైదరాబాద్‌లో బ్లూస్టార్ వైస్ ప్రెసిడెంట్ మార్కెటింగ్ గిరీష్ హింగోరని, ఆ గ్రూప్ ప్రెసిడెంట్ మోహిత్ సుద్ ఆ కంపెనీ ప్రీమియం శ్రేణీ ఐకోనియా ఉత్పత్తులను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ.. కంపెనీ పోర్ట్‌ఫోలియోలో ఇప్పుడు 125 రకాల రూమ్ ఎయిర్ కండీషనర్ మోడళ్లు ఉన్నాయన్నారు. ఇందులో వినియోగదారుల అవసరాలకు, వివిధ రకాల వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రూపొందించిన ఫ్లాగ్‌షిప్ ప్రీమియం శ్రేణి ఐకోనియా కూడా ఉందన్నారు. ప్రస్తుతం 1.4 కోట్ల యూనిట్లుగా ఉన్న ఎసి మార్కెట్.. 2030 నాటికి 3 కోట్ల




యూనిట్లకు విస్తరిస్తుందని అంచనా వేశారు. ఎసి పరిశ్రమ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది ధరలు 7 నుంచి 8 శాతం వరకు పెరగనున్నట్లు గిరీష్, మోహిత్ సుద్ తెలిపారు. ప్రధానంగా రాగి అల్యూమినియం, స్టీల్ వంటి ముడిసరుకుల ధరలు పెరగడం వల్ల ఉత్పత్తి వ్యయం దాదాపు 8.5 శాతం అధికమైందన్నారు.. దీనికి తోడు కొత్త ఇంధన సామర్థ్య నిబంధనల ప్రకారం తయారీలో మార్పులు చేయాల్సి రావడంతో మరో 4 శాతం అదనపు భారం పడిందన్నారు. పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణం వల్ల ప్లాస్టిక్ విడిభాగాలకు అవసరమైన ఆయిల్, ఎల్ఎన్‌జి లభ్యత తగ్గడం కూడా ఈ సంక్షోభానికి ప్రధాన కారణమన్నారు. ఈ భారాన్ని అప్పుడే వినియోగదారులపై మోపే అవకాశాలు లేవన్నారు.

# ఆశల పల్లకిలో...






### రెండో టైటిల్ లక్ష్యంగా గుజరాత్ టైటాన్స్
### ఐపీఎల్‌లో నిలకడైన ప్రదర్శన
### గిల్ సారథ్యమే కీలకం

ఐపీఎల్‌లో అడుగు పెట్టిన తొలి ఏడాదే చాంపియన్‌గా నిలిచి సంచలనం సృష్టించడంతో పాటు తర్వాతి ఏడాది కూడా రన్నరప్‌గా నిలిచి గుజరాత్ టైటాన్స్ తమ స్థాయిని ప్రదర్శించింది. అయితే ఆ తర్వాతి సీజన్‌లో అనూహ్యంగా వెనుకబడి ఎనిమిదో స్థానానికే పరిమితమైంది. కానీ గత సీజన్‌లో మెరుగైన ప్రదర్శనతో 'ప్లే ఆఫ్స్'కు చేరగలిగింది.
2025తో పోలిస్తే పెద్దగా మార్పులు లేకుండా ఈసారి కూడా జట్టు బరిలోకి దిగుతోంది. శుబ్‌మన్ గిల్ నాయకత్వానికి ఆశిష్ నెహ్రా కోచింగ్ వ్యూహాలు తోడైతే రెండో టైటిల్‌ను ఆశించవచ్చు. అయితే జోస్ బట్లర్, రషీద్ ఖాన్‌లాంటి స్టార్స్ ఇటీవలి తమ వైఫల్యాలను అధిగమించి ఫామ్‌లోకి రావడం జట్టుకు కీలకం. గత సీజన్‌లో లీగ్ దశలో 9 మ్యాచ్‌లు గెలిచి మూడో స్థానంలో నిలిచిన టైటాన్స్... 'ఎలిమినేటర్'లో ముంబై చేతిలో ఓడి నిష్క్రమించింది. ఐపీఎల్ వేలంలో ఈ ఏడాది గుజరాత్ ఐదుగురు ఆటగాళ్లనే ఎంచుకుంది. వీరిలో ముగ్గురు విదేశీయులు హోల్డర్, టామ్ బాంటన్, ల్యూక్ వుడ్ ఉన్నారు. షెర్ఫాన్ రూథర్‌ఫర్డ్‌ను జట్టు వదిలేసుకొని అతని స్థానంలో టామ్ బాంటన్‌ను ఎంచుకుంది.
గాయం కారణంగా గత సీజన్‌లో ఒక్క మ్యాచ్ కూడా ఆడలేకపోయిన ఫిలిప్స్ ఈసారి అందుబాటులో ఉండటం గుజరాత్ బలాన్ని పెంచింది. తుది జట్టులో ఆడే విదేశీ ఆటగాళ్లలో రషీద్, బట్లర్‌లకు చోటు ఖాయం కాబట్టి బాంటన్, ఫిలిప్స్‌లలో ఒకరికే అవకాశం దక్కవచ్చు. ఎందుకంటే బౌలింగ్‌లో రబాడ లేదా హోల్డర్‌కు అవకాశం కల్పించడం కూడా కీలకం.

**టాప్--3 పైనే...**

గుజరాత్ మరోసారి తమ టాప్--3 బ్యాటింగ్ ఆర్డర్‌పైనే ప్రధానంగా ఆధారపడుతోంది. గిల్, సాయి సుదర్శన్, బట్లర్ కలిసి 2025 సీజన్‌లో జట్టు మొత్తం స్కోరులో 74.54 శాతం స్కోరు సాధించారు. ఒకే టీమ్ నుంచి టాప్--3 ఒక సీజన్‌లో 500కు పైగా పరుగులు చేయడం కూడా ఇదే తొలిసారి. అయితే ఈసారి టైటాన్స్ ఇదే విషయంలో కొంత సవాల్‌ను కూడా ఎదుర్కొంటోంది. గిల్ భారత టి20 జట్టులో చోటు కోల్పోయాడు. బట్లర్ తన కెరీర్‌లోనే అతి ఘోరమైన ఫామ్‌లో ఉన్నాడు. ఇటీవలి టి20 వరల్డ్ కప్‌లో ఎనిమిది మ్యాచ్‌లలో అతని అత్యధిక స్కోరు 26 కాగా, ఐదుసార్లు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యాడు. సాయిసుదర్శన్ కూడా గాయం నుంచి కోలుకుంటున్నాడు. కాబట్టి మిడిలార్డర్‌లో బాంటన్, ఫిలిప్స్, సుందర్, షారుఖ్, తెవాటియాలపై భారీ స్కోరు భారం ఉంది. గత రెండు సీజన్లలో మిడిలార్డర్ బ్యాటర్లు కలిపి అతి తక్కువ పరుగులు చేసిన జట్టు గుజరాత్‌దే. ఈసారి మాత్రం అదనపు బాధ్యత తీసుకోవాల్సి ఉంటుంది. ఆస్ట్రేలియా దిగ్గజం మాథ్యూ హేడెన్‌ను గుజరాత్ తాజా సీజన్ కోసం బ్యాటింగ్ కోచ్‌గా ఎంచుకుంది కాబట్టి అతని ప్రభావం కూడా కొంత ఉండవచ్చు.

**రషీద్ రాణించేనా...**

ఐపీఎల్‌లో 9 సీజన్లు ఆడిన లెగ్‌స్పిన్నర్ రషీద్ ఖాన్ అత్యుత్తమ బౌలర్లలో ఒకడిగా గుర్తింపు పొందాడు. కానీ ఇటీవల రషీద్ ఏమాత్రం ప్రభావం చూపలేకపోతున్నాడు. గత రెండు సీజన్లలో అతని ఫామ్ పేలవంగా ఉంది. 2025లోనైతే మరీ ఘోరంగా కనీసం 10 వికెట్లు కూడా తీయలేకపోయిన రషీద్ ఏకంగా 57.11 సగటు నమోదు చేశాడు. ఎకానమీ కూడా 9కి పైగా ఉంది. ఇలాంటి స్థితిలో అతను మళ్లీ లయ అందుకుంటే తప్ప గుజరాత్ బౌలింగ్ బలహీనంగా మారిపోతుంది. లెఫ్టార్మ్ స్పిన్నర్ సాయికిషోర్ ప్రభావం చూపించగలడు. సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ ప్రధాన పేసర్లు కాగా...మూడో పేసర్‌గా ఆల్‌రౌండర్ నైపుణ్యం ఉన్న హోల్డర్ వైపే జట్టు మొగ్గు చూపవచ్చు. వేలంలో రూ.7 కోట్లకు ఎంచుకున్న హోల్డర్ ఇటీవలి వరల్డ్ కప్‌లో మెరుగ్గా రాణించాడు. గత ఏడాది డోపింగ్ నిషేధం కారణంగా నాలుగు మ్యాచ్‌లకే పరిమితమైన రబాడ ఈసారి పూర్తి స్థాయిలో అందుబాటులో ఉన్నాడు. విదేశీ ప్రత్యామ్నాయ పేసర్‌గా లెఫ్టార్మ్ బౌలర్ ల్యూక్‌వుడ్ అందుబాటులో ఉన్నాడు. సీనియర్ పేసర్ ఇషాంత్‌కు తుది జట్టులో స్థానం లభించడం కష్టమే. ఆంధ్ర ఆటగాడు పృథ్వీరాజ్ గాయం కారణంగా లీగ్‌కు దూరమయ్యాడు. 2019 సీజన్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్ తరఫున 2 మ్యాచ్‌లు ఆడిన తర్వాత అతను ఇప్పటి వరకు మరో ఐపీఎల్ మ్యాచ్ ఆడలేదు. గుజరాత్ టైటాన్స్ జట్టు: శుబ్‌మన్ గిల్ (కెపట?టన్), జోస్ బట్లర్, కుమార్ కుశాగ్ర, అనూజ్ రావత్, టామ్ బాంటన్, గ్లెన్ ఫిలిప్స్, సాయిసుదర్శన్, నిశాంత్, వాషింగ్టన్ సుందర్, అర్షద్ ఖాన్, సాయికిషోర్, జయంత్ యాదవ్, జేసన్ హోల్డర్, రాహుల్ తెవాటియా, షారుఖ్ ఖాన్, రబాడ, సిరాజ్, ప్రసిధ్ కృష్ణ, మానవ్ సుతార్, గుర్నూర్ సింగ్, ఇషాంత్ శర్మ, అశోక్ శర్మ, ల్యూక్‌వుడ్, రషీద్ ఖాన్, కుల్వంత్ ఖెజ్రోలియా.

## స్పోర్ట్స్

### 'ఇంపాక్ట్' నిబంధన కొనసాగుతుంది



**ముంబై:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో గత కొంత కాలంగా చర్చకు కారణమవుతున్న 'ఇంపాక్ట్ సబ్' నిబంధనపై గవర్నింగ్ కౌన్సిల్ స్పష్టతనిచ్చింది. లీగ్‌లో ఈ నిబంధన కనీసం 2027 వరకు కొనసాగుతుందని వెల్లడించింది. ఐపీఎల్ నిబంధనలు, ఇతర సూచనలకు సంబంధించి బుధవారం బీసీసీఐ కార్యాలయంలో 10 జట్ల సారథులతో 'కెప్టెన్స్ మీట్' జరిగింది. ఇందులో అన్ని అంశాలపై కౌన్సిల్ ప్రతినిధులు కెప్టెన్ల సందేహ నివృత్తి చేశారు. ముఖ్యంగా 'ఇంపాక్ట్ సబ్'పై అభ్యంతరాలు కూడా వ్యక్తమయ్యాయి. 2023లో దీనిని తొలిసారి ప్రవేశపెట్టారు. ఆపై 2027 వరకు ఈ నిబంధనను పొడిగిస్తూ 2024లోనే బీసీసీఐ నిర్ణయం తీసుకుంది. 'పలువురు కెపట?టన్లు దీనిపై తమ అభిప్రాయాలు వెల్లడించారు. అయితే 2027 వరకు దానిని మార్చలేమని వారికి చెప్పాం' అని బోర్డు వర్గాలు వెల్లడించాయి. రెండో ఇన్నింగ్స్‌లో మంచు ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుంటూ 10 ఓవర్ల తర్వాత కొత్త బంతిని తీసుకునే అవకాశం ఫీల్డింగ్ కెప్టెన్లకు గత సీజన్‌లో కల్పించారు. అయితే ఈసారి తొలి ఇన్నింగ్స్ సమయంలో కూడా అలాంటి అవకాశం ఇవ్వాలని కెప్టెన్లు సూచించారు. దీనిపై కూడా కౌన్సిల్ వివరణ ఇచ?చంది. మంచు కారణంగానే కొత్త బంతిని ఇస్తున్నాం కాబట్టి గత ఏడాదిలాగే ఈసారి కూడా నిబంధనలో ఎలాంటి మార్పు ఉండదని చెప్పింది.


**హర్షిత్ రాణా స్థానంలో నవ్‌దీప్ సైనీ**

గాయంతో ఐపీఎల్‌కు దూరమైన హర్షిత్ రాణా స్థానంలో కోల్‌కతా నైట్ రైడర్స్ నవ్‌దీప్ సైనీని ఎంపిక చేసుకుంది. టి20 ప్రపంచకప్ ముందు గాయపడ్డ హర్షిత్ రాణా మోకాలికి శస్త్రచికిత్స జరగగా... అతడు ఈ సీజన్ మొత్తానికి అందుబాటులో లేకుండా పోయాడు. గుజరాత్ టైటాన్స్‌కు ఆడాల్సిన ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ యర్రా పృథ్వీరాజ్ కూడా గాయంతో దూరమయ్యాడు. అతని స్థానంలో రూ. 30 లక్షల ప్రాథమిక ధరతో కుల్వంత్ ఖెజ్రోలియాను గుజరాత్ ఎంపిక చేసుకుంది.



# మల్టీస్టారర్ సినిమాలో కీర్తి సురేష్

నేషనల్ అవార్డు విన్నర్, 'మహానటి' కీర్తి సురేష్ ప్రస్తుతం తన కెరీర్‌లో గోల్డెన్ పీరియడ్‌ను ఎంజాయ్ చేస్తున్నారు. టాలీవుడ్‌లో వరుస హిట్లు కొడుతూనే, బాలీవుడ్‌లో కూడా 'రఫ్తార్' వంటి క్రేజీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. తాజాగా ఈ అమ్మడు ఖాతాలో మరో భారీ తెలుగు సినిమా వచ్చి చేరినట్లు సోషల్ మీడియాలో వార్తలు హల్చల్ చేస్తున్నాయి. ఇటీవల 'శంకర్ వరప్రసాద్' చిత్రంతో బాక్సాఫీస్ వద్ద సెన్సేషన్ క్రియేట్ చేసిన దర్శకుడు అనిల్ రావిపూడి, ఇప్పుడు ఒక భారీ మల్టీస్టారర్ కథను సిద్ధం చేశారు. ఇక ఇందులో విక్టరీ వెంకటేష్ నందమూరి కళ్యాణ్ రామ్ వంటి ఇద్దరు స్టార్ హీరోలు కలిసి నటిస్తుండగా.. కీర్తి సురేష్ హీరోయిన్‌గా అవకాశం దక్కించుకున్నట్లు సమాచారం. అనిల్ రావిపూడి సినిమాల్లో హీరోయిన్ల పాత్రలు చాలా ఎనర్జిటిక్‌గా ఉంటాయి, కాబట్టి కీర్తి ఈ సినిమాలో కొత్త మేనరిజమ్స్‌తో అలరించడం ఖాయమని తెలుస్తోంది. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థలు షైన్ స్క్రీన్స్ సురేష్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఇక ఈ సినిమాను వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా విడుదల చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. పండగ సీజన్‌లో వెంకటేష్ ఫ్యామిలీ ఆడియన్స్‌ను, కళ్యాణ్ రామ్ మాస్ ప్రేక్షకులను ఆకట్టుకుంటే బాక్సాఫీస్ దగ్గర రికార్డులు తిరగరాయడం ఖాయం అని చెప్పొచ్చు. త్వరలోనే ఈ సినిమా షూటింగ్,కీర్తి సురేష్ పాత్రకు సంబంధించిన మరిన్ని వివరాలు వెల్లడి కానున్నాయట.



## డైరెక్టర్ నాతో అసభ్యంగా ప్రవర్తించాడు

కుంభమేళా కారణంగా ఓవర్ నైట్ స్టార్ అయిన మోనాలిసా మరోసారి వార్తలు నిలిచారు. దర్శకుడు సనోజ్ మిశ్రాపై సంచలన ఆరోపణలు చేశారు. సినిమా సెట్ లో తనతో అసభ్యంగా ప్రవర్తించారని, ఒంటరి దాన్ని చేసి ఆడుకున్నారని షాకింగ్ నిజాలను బయటపెట్టారు మోనాలిసా. ఈ ఘటన జరిగినప్పుడు తాను మైనర్ అని వ్యాఖ్యానించారు. కుటుంబ సభ్యులకు చెప్పినప్పటికీ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలోనే దర్శకుడు సనోజ్ మిశ్రాపై ఫిర్యాదు చేయనున్నట్లు ప్రకటన చేశారు. ఇటీవల ఫర్హాన్ ఖాన్ ను వివాహం చేసుకున్న మోనాలిసా, తన కుటుంబంపై కూడా ఆరోపణలు చేశారు. తన ఫ్యామిలీ నుంచి ప్రాణహాని ఉందని గతంలో పోలీసులకు ఫిర్యాదు కూడా చేశారు. ఇది ఇలా ఉండగా, తన చిరకాల మిత్రుడు ఫర్హాన్ ఖాన్ ను ఇటీవలే మోనాలిసా పెళ్లి చేసుకున్నారు. కేరళలోని తిరువనంతపురంలో వీళ్ళ వివాహం గ్రాండ్ గా జరిగింది. సరిగ్గా సంవత్సరం కిందట మహారాష్ట్రకు చెందిన నటుడు ఫర్హాన్ ఖాన్ , మోనాలిసాకు ఫేస్బుక్ ద్వారా పరిచయం ఏర్పడింది. ఆ తర్వాత ఈ ఇద్దరు ప్రేమించుకుని, లేటెస్ట్ గా పెళ్లి చేసుకున్నారు. అయితే వీరి వివాహాన్ని మోనాలిసా ఫ్యామిలీ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది.



## ఆ అవమానం భరించలేకపోయా

బాలీవుడ్ సినిమాల్లో తన గ్లామర్‌తో మెప్పించిన నటి సమీరా రెడ్డి. ప్రస్తుతం ఆమె సినిమాలకు దూరంగా ఉన్నప్పటికీ, సోషల్ మీడియా ద్వారా నిత్యం వార్తల్లో నిలుస్తూనే ఉంటారు.తాజాగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న సమీరా, తన చిన్ననాటి చేదు అనుభవాలను పంచుకున్నారు. "నా చిన్నతనంలో నాకు తీవ్రమైన నత్తి ఉండేది. నేను ఏదైనా మాట్లాడటానికి ప్రయత్నిస్తే అక్షరాలు సరిగ్గా వచ్చేవి కావు. దానివల్ల నాతో పాటు చదువుకునే పిల్లలు, చుట్టుపక్కల వారు నన్ను విపరీతంగా వెక్కిరించేవారు. నన్ను ఆటపట్టిస్తూ వేధించేవారు. ఆ వయసులో ఆ అవమానాలు భరించడం నాకు చాలా కష్టంగా ఉండేది. నా ఆత్మవిశ్వాసం పూర్తిగా దెబ్బతిన్న సమయం అది ఈ సమస్య నుండి బయటపడటానికి, నాపై నాకు నమ్మకం కలగడానికి నేను సంవత్సరాల తరబడి థెరపీ చేయించుకోవాల్సి వచ్చింది. ఎన్నో వ్యాయామాలు, కఠినమైన ప్రాక్టీస్ తర్వాతే నేను ఈ రోజు ఇలా ధైర్యంగా మాట్లాడగలుగుతున్నాను. కానీ, దురదృష్టవశాత్తూ ఇప్పటికీ నేను ఎప్పుడైనా మాట తడబడి నత్తిగా మాట్లాడితే.. ఎవరైనా దానిపై సెటైర్లు వేసినా లేదా నవ్వుకున్నా నాకు చాలా బాధగా ఉంటుంది. ఆ పాత చేదు జ్ఞాపకాలు మళ్ళీ గుర్తొస్తాయి" అని ఎమోషనల్ అయింది. కేవలం నత్తి సమస్యే కాకుండా, సినిమా ఇండస్ట్రీలోకి వచ్చిన కొత్తలో తన రంగు గురించి, బాడీ షేప్ గురించి కూడా ఎదురైన విమర్శలను ఆమె ధైర్యంగా ఎదుర్కొన్నారు. లోపాలు ఎవరికైనా ఉంటాయని, వాటిని అధిగమించి ముందుకు సాగడమే నిజమైన విజయమని సమీరా తన మాటల ద్వారా నిరూపించారు. ఒక స్టార్ హీరోయిన్ తన బలహీనతను ఇంత బహిరంగంగా ఒప్పుకోవడం పట్ల నెటిజన్లు ఆమెను అభినందిస్తున్నారు.

## 'అదుర్స్' సినిమా సీక్వెల్‌పై క్లారిటీ ఇచ్చిన వి.వి వినాయక్



టాలీవుడ్ హిస్టరీలో అత్యంత ప్రజాదరణ పొందిన సినిమాల్లో 'అదుర్స్' ఒకటి. యంగ్ టైగర్ ఎన్టీఆర్, మాస్ డైరెక్టర్ వి.వి. వినాయక్ కాంబినేషన్‌లో వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద సృష్టించిన ప్రభంజనం అంతా ఇంతా కాదు. ముఖ్యంగా ఇందులో ఎన్టీఆర్ చేసిన డబుల్ యాక్షన్.. ఒకవైపు మాస్ హీరోగా 'నరసింహా', మరోవైపు అమాయకపు బ్రాహ్మణుడిగా 'చారి' పాత్రలో చేసిన రచ్చ ఇప్పటికీ ప్రేక్షకులకు కళ్లముందే ఉంటుంది. అయితే, గత కొన్నేళ్లుగా ఈ సినిమాకు సీక్వెల్ వస్తుందని సోషల్ మీడియాలో రకరకాల వార్తలు వినిపిస్తున్నాయి. తాజాగా ఈ విషయంపై దర్శకుడు వి.వి.వినాయక్ పూర్తి క్లారిటీ ఇచ్చి ఫ్యాన్స్‌ను నిరాశపరిచారు. ఇటీవల ఒక కార్యక్రమంలో పాల్గొన్న వి.వి. వినాయక్, 'అదుర్స్ 2' గురించి అడిగిన ప్రశ్నకు చాలా నిజాయితీగా సమాధానం ఇచ్చారు. "మనం నిజం మాట్లాడుకుంటే.. ఆ సినిమా కథ అక్కడితోనే అయిపోయింది. సీక్వెల్ తీయడానికి ఇప్పుడు అక్కడ ఏమీ మిగలలేదు. ఒకవేళ సీక్వెల్‌ను బలవంతంగా తీసినా, మళ్లీ అంత గొప్పగా చేయగలమనే నమ్మకం నాకు లేదు. మొదటి భాగం అందించిన ఆ అనుభూతిని దెబ్బతీయడం నాకు ఇష్టం లేదు. అందుకే ఈ విషయాన్ని ఇంతటితో వదిలేయడమే అందరికీ మంచిది" అని ఆయన స్పష్టం చేశారు. అదుర్స్ సినిమాలో ఎన్టీఆర్, బ్రహ్మానందం మధ్య పండిన కామెడీ ఒక అద్భుతమని, దాన్ని మళ్లీ రీక్రియేట్ చేయడం అంత సులభం కాదని ఆయన అభిప్రాయపడ్డారు.



## చరణ్‌కు గాయం.. 'పెద్ది' సంబరాలకు ఆటంకం?

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్‌కు ఇటీవల ప్రమాదవశాత్తూ గాయపడ్డారని వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. దాంతో చరణ్ నటిస్తున్న 'పెద్ది' సినిమా నుంచి రాబోయే అప్‌డేట్ ఆలస్యమవుతుందేమోనని అభిమానుల్లో సందేహాలు మొదలయ్యాయి. అయితే యూనిట్ తాజాగా ఇచ్చిన స్పష్టతతో ఆ అనుమానాలన్నీ తొలగిపోయాయి. చరణ్ ఎడమ కంటికి చిన్నపాటి గాయం మాత్రమే జరిగింది. దానికి వెంటనే ట్రీట్‌మెంట్ జరిగిందని 'పెద్ది' టీమ్ తెలిపింది. రేపట్నుంచే ఆయన తిరిగి సెట్స్‌లో పాల్గొనబోతున్నారని కూడా ప్రకటించింది. ఇక అభిమానులకు గుడ్ న్యూస్ ఏమిటంటే.. చరణ్ పుట్టినరోజు కానుకగా 'పెద్ది' నుంచి ప్రత్యేక గ్లింప్స్ రాబోతోంది. మార్చి 27 ఉదయం 11:07 గంటలకు దర్శకుడు బుచ్చిబాబు ఇప్పటికే రెడీ చేసిన టీజర్ విడుదల కానుంది. ఇప్పటికే చరణ్ చేసిన బ్యాట్ విన్యాసం సోషల్ మీడియాలో సూపర్ హిట్ అయింది. అదే తరహాలో ఈ బర్త్‌డే టీజర్ కూడా భారీ విజయాన్ని సాధిస్తుందనే అంచనాలు ఉన్నాయి. అంటే రామ్ చరణ్ గాయంపై ఎలాంటి ఆందోళన అవసరం లేదు. పెద్ది సినిమాకు సంబంధించిన అప్‌డేట్స్, సంబరాలు ఎలాంటి ఆటంకం లేకుండా కొనసాగనున్నాయి. ఈ విషయాన్ని తెలియజేస్తూ పెద్ది టీమ్ ఓ పోస్టర్‌ను కూడా విడుదల చేసింది.ఖ

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com